Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 89 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 ఏప్రిల్ 2023 శుక్రవారం పేజీలు : 4

## హెల్మెట్ పట్టీ పెట్టుకోకుంటే.. 1,000 జరిమానా!

న్యూఢిల్లీ : హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడిపితే.. జరిమానా ఎంతో తెలుసా? కొత్త మోటారు వాహన చట్టం మేరకు రూ. 1,000 దాకా పెనాల్టీ తప్పదు. అయితే.. హెల్మెట్ పట్టీ (స్ట్రాప్) లేకున్నా.. ఐఎస్ఐ మార్క్ లేని హెల్మెట్‌ను వాడినా విధించే జరిమానా ఎంతో తెలుసా?? అక్షరాలా రెండు వేల రూపాయలు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జూన్ 1 నుంచి భారత నాణ్యత-ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) గుర్తింపు లేని హెల్మెట్లను నిషేధించిన విషయం తెలిసిందే..! ఈ నేపథ్యంలో కొత్త మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 194డీ ప్రకారం.. ఈ ఉల్లంఘనకు రూ. 1,000 మేర జరిమానా ఉంటుంది. అదేవిధంగా.. ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ఉన్నా.. దానికి పట్టీ(స్ట్రాప్) లేకున్నా.. వాహనదారుడు దాన్ని పెట్టుకోకున్నా.. మరో రూ. 1,000 జరిమానా విధించాలని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. పైగా.. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 129 ప్రకారం.. ఈ రెండు ఉల్లంఘనలకు మూడు నెలల పాటు లైసెన్స్‌ను సస్పెండ్ చేసే అవకాశాలు ఉంటాయి.

# బిజెపికే కాదు బిఆర్ఎస్‌కు అవసరమే!!



## 'కర్నాటక' చుట్టూ తెలంగాణ రాజకీయాలు!!

హైదరాబాద్ : తెలంగాణలో వచ్చే ఎన్నికల కోసం బీఆర్ఎస్ అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇదే సమయంలో జాతీయ రాజకీయాల్లో పట్టు సాధించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. త్వరలో కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను పరిచయం చేయాలని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఆరాటపడుతున్నారు. అయితే గతంలో తాము నేరుగా పోటీ చేస్తామని ప్రకటించినప్పటికీ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మిత్రపక్షమైన జేడీఎస్ కు మద్దతు ఇవ్వడమే కరెక్ట్ అని గులాబీ నేతలు అనుకుంటున్నారు. అందుకే ఆ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఇదే సమయంలో ఆ రాష్ట్రంలో ఒకవేళ కాంగ్రెస్ లేదా బీజేపీ అధికారంలోకి వచ్చే సూచన కనిపిస్తే ఆ తరువాత తెలంగాణలో కేసీఆర్ రూట్ మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తరువాత తెలంగాణలో జరుగుతాయి. అయితే అంతకంటే ముందే కర్ణాటకలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందోనని స్థానిక పార్టీల కంటే బీఆర్ఎస్ కే గుబులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే కర్ణాటకలు వచ్చిన ఫలితాలు తెలంగాణపై ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇక్క కాంగ్రెస్ లేదా బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణలోని సదరు పార్టీని కట్టడి చేయాలని చూస్తున్నారు. ఒకవేళ హంగ్ ఏర్పడితే మాత్రం జేడీఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ లను రెండు వైపులా కాంగ్రెస్ బీఆర్ఎస్ లు పోటా పోటీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే రెండు పార్టీలు తమంటే తామే అధికారంలోకి వస్తాయని నమ్ముతున్నాయి. అయితే కర్ణాటకలో ఒకవేళ మరోసారి బీజేపీ వస్తే దక్షిణాదిన బీజేపీ హవా సాగుతుందని ఆ పార్టీ నాయకులు తెలంగాణలో ప్రచారం చేసుకోనున్నారు. ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే ప్రజలు మార్పును కోరుతున్నారని వచ్చేది కాంగ్రెస్ రాజ్యమేనని ప్రజల్లోకి వెళ్తారు. ఈ రెండు పార్టీలో కర్ణాటక ఎన్నికల ఫలితాలను వాడుకోనున్నారు. కానీ అంతకంటే ముందే బీఆర్ఎస్ బిగ్ ప్లాన్ చేస్తోంది. కర్ణాటక ఫలితాల ఆధారంగా బీఆర్ఎస్ కాంగ్రెస్ బీజేపీలపై చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతోంది. ఈ రెండు పార్టీల్లో ఏదీ కర్ణాటకలో గెలిచినా బీఆర్ఎస్ కు మైనస్ గా మారే అవకాశం ఉంది. అందువల్ల ఆ పార్టీ లు గెలవకుండా కర్ణాటకలో బీఆర్ఎస్ ప్రచారం చేయనుంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే మాత్రం తాము కర్ణాటకలో పాగా వేశామని జాతీయ రాజకీయాల్లో ఇక బీఆర్ఎస్ కు బీజం పడిందని కేసీఆర్ ప్రచారం చేయనున్నారు. కానీ ఏం జరుగుతుందో తెలియక అయోమయంలో ఉన్నారు.




## తీర్పు నిలుపుదల పిటిషన్ తిరస్కరణ

సూరత్: పరువు నష్టం కేసులో తనకు విధించిన శిక్షను నిలిపేయాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వేసిన స్టే పిటిషన్‌ను గుజరాత్‌లోని సూరత్ సెషన్స్ కోర్టు గురువారం తిరస్కరించింది. 'మోదీ' ఇంటిపేరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు.. రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. ట్రయల్ కోర్టు ఈ కేసుపై పారదర్శకంగా విచారణ చేపట్టకుండా కఠినంగా వ్యవహరించిందని, ఇది రెండేళ్లు జైలుశిక్ష విధించాల్సినంత కేసు కాదంటూ సెషన్స్ కోర్టును రాహుల్ ఆశ్రయించారు. శిక్షను నిలిపివేయకపోతే తన ప్రతిష్ఠకు పూడ్చలేని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రాహుల్ పిటిషన్‌పై గత గురువారం వాదనలు విన్న న్యాయమూర్తి ఆర్‌పీ మొగేరా తీర్పును నేడు వెలువరించారు. 'దొంగలందరికీ మోదీ అనే ఇంటిపేరే ఎందుకు ఉంటుందో?' అంటూ 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ వ్యాఖ్యానించారంటూ గుజరాత్ భాజపా ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ న్యాయస్థానంలో పరువునష్టం దావా వేశారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే దీన్ని పై కోర్టులో సవాల్ చేసేందుకు వీలుగా 30 రోజుల గడువు ఇచ్చింది. అప్పటి వరకు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత రాహుల్‌పై ఎంపీగా అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నిర్ణయం తీసుకుంది.

# టీచర్లకు ఎసరు పెడుతున్న కేసీఆర్ సర్కార్?

హైదరాబాద్ : అధికారంలో ఉన్న తమను ఎదురిస్తే ఎలాంటి చర్యలకైనా వెనుకాడమని కేసీఆర్ సర్కార్ నిరూపించేందుకు రెడీ అవుతోంది. మహబూబ్ నగర్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన వ్యక్తికి కాదని బీజేపీ సపోర్టు చేసిన వ్యక్తిని ఉపాధ్యాయులు గెలిపించారు. ఇందుకు ప్రతికారంగా వారి విషయంలో కఠినంగా ఉండబోతుంది. టీచర్ల హాజరు విషయంపై ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు అందాయి. కానీ ఇంతకాలం వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ లేటేస్టుగా వీరి హాజరు విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు ప్లాన్ వేస్తోంది. ప్రతి ఒక్క టీచర్ హాజరయ్యేందుకు పక్కా ప్లాన్ వేస్తోంది. ప్రభుత్వ టీచర్లపై పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కొన్ని స్కూళ్లల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కానీ సాంకేతిక సమస్యలతో అవి పనిచేయడం లేదు. దీనికి బదులు ముఖ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా అవకతవకలు జరగవని ఆలోచిస్తున్నారు. అయితే ఈ విధానాన్ని ఇప్పటికే ఢిల్లీ ఏపీ ప్రభుత్వాలు ప్రవేశపెట్టడంతో అక్కడ విమర్శలు వచ్చాయి. ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా తమ పర్సనల్ డేటా చోరీ అవుతుందని కొందరు భావిస్తే.. అటెండెన్స్ సమయంలో మిషన్లు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆందోళన చేశారు. ఇప్పుడు తెలంగాణ ఉపాధ్యాయులు కూడా ఫేస్ రికగ్నైషన్ విధానంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఫేస్ రికగ్నైషన్ విధానాన్ని ముందుగా రంగారెడ్డి మేడ్జల్ జిల్లాలో అమలు చేయనున్నారు. ఇక్కడ సక్సెస్‌అయితే ఇతర జిల్లాల్లో ప్రవేశపెడుతారు. దీని వినియోగంపై



కొందరు అధికారులకు పూర్తిగా శిక్షణ ఇవ్వనున్నారు. అయితే అంతకంటే ముందే టీచర్లకు సంబంధించిన డేటాను సేకరించనున్నారు. వారి ఫొటోలు డేటాను సేకరించి సిస్టమ్ లో అప్లోడ్ చేస్తారు. అయితే పనిచేస్తున్న స్కూల్ యూ డైస్ కోడ్ ఐడీ నంబర్ తదితర వివరాలు పెట్టనున్నారు. ఫేస్ రికగ్నైషన్ విధానాన్ని టీచర్లు సొంతంగా ఉపయోగించనున్నారు. ముందుగా దీనికి సంబంధించిన యాప్ ను డౌన్లోడ్ చేసుకొని తరగతి గదికి వెళ్లిన తరువాత అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. పది సెకన్ల పాటు ఈ అటెండెన్స్ ప్రక్రియ జరుగుతుంది. ఆ స్కూల్ లో పనిచేసే సంబంధిత అధికారి అటెండెన్స్ వివరాలు తీసుకొని యాప్ లో నమోదు చేస్తారు. ఈ విధానాన్ని ఇప్పటికే ఏపీలో అమలు చేశారు. ఇందులో టెక్నికల్ సమస్యలు ఎదురు కావడంతో ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు. అటెండెన్స్ సమయంలో యాప్ పనిచేయకపోయినా.. సర్వర్ బిజీగా ఉన్నా తమ టైమింగ్స్ లో తేడాలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. అలాగే ఒక్కోసారి ఇవి తప్పుగా నమోదవుతే బాధ్యులు ఎవరన ప్రశ్నించారు.

కానీ ఇప్పుడు తెలంగాణలో ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా అవే సమస్యలు వస్తాయా? అని చర్చించుకుంటున్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మదేళ్లు అవుతున్నా పాఠశాలలో నెలకొన్న సమస్యలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా టీచర్ల హాజరుపై ఇప్పటికే వేలకొద్ది ఫిర్యాదులు వచ్చినా వాటిని పక్కనపడేసింది. అయితే ఇప్పుడే ఎందుకు ఈ విధానాన్ని అమలు చేయాల్సి వస్తోందని కొందరు చర్చించుకుంటున్నారు. గత మహబూబ్ నగర్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినందుకే వారిపై చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతున్నారని కొందరు అనుకుంటున్నారు.




# బాబోయ్ ఎండలు మండేస్తున్నాయ్..!

## మగ్గిపోతున్న తెలుగురాష్ట్రాలు

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. చాలా చోట్లు 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఉమ్మడి ఆదిలాబాద్ లో కూడా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 44.3 డిగ్రీలు, మంచిర్యాల తుమ్మెరలో 43.9 డిగ్రీలు, కుమురంభీమ్ జిల్లా తిర్యాణిలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఏపీలో ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. తర్లుపాడు, పెద్దారవీడు, గుళ్లాపల్లిల్లో ఏకంగా 45డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు అయింది. మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్రంలోనే అత్యధికంగా తర్లుపాడులో 45.83 డిగ్రీలు నమోదైంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో కరెంటు డిమాండ్ కూడా పెరిగింది. ఫ్యాన్లు, ఏసీ, కూలర్ల వాడకం పెరగడంతో విద్యుత్ కు డిమాండ్ ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాల్లో అనధికార కోత విధిస్తున్నట్లు తెలిసింది. దేశ వ్యాప్తంగా కూడా ఎండలు మండిపోతున్నాయి. తీవ్రమైన వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఎండకాలంలో సౌత్ ఇండియాలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది. అటు ఉత్తర భారతంలో కూడా ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్ 16న నవీ ముంబైలో నిర్వహించిన మహారాష్ట్ర భూషణ్ అవార్డు ఫంక్షన్‌కు వచ్చిన వారిలో 11 మంది వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయారు. మరో 50 ఆస్పత్రిలో చేరారు. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రతి ఏడాది జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలకు అత్యధిక మంది మృతి చెందుతున్న దేశాల జాబితాలో భారత్ నిలుస్తోంది. మన దేశంలో సుమారు 1.4 బిలియన్ల మంది జనాభా బయటే పనిచేస్తారు. దీంతో వారికి ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రతి సంవత్సరం ఎక్కువ సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, రిక్షా పుల్లర్లు వడదెబ్బకు బలవుతున్నారు. సోమవారం ఒడిశాలోని బరిపాడలో 44 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది. ప్రధాని మోడీతో యాపిల్ సీఈవో భేటీ: థ్యాంక్సంటూ టిమ్ కుక్ దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రత కంటే 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఐఎండి పేర్కొంది. ఉత్తర భారత రాష్ట్రాలైన హర్యానా, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశాతో సహా పలు ప్రాంతాలకు ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. ఎండ తీవ్రతతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు బయటకు రావడం లేదు. ఎండ వేడిమి తట్టుకోలేక చాలా మంది కూల్ డ్రింక్స్, ఐస్ క్రీముల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎండల పట్ల జాగ్రత్త ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకపోవడమే మంచిదని చెబుతున్నారు. అత్యవమైతే తప్ప బయటకు రావొద్దని కోరుతున్నారు. అత్యవసరంగా బయటకు వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## సంపాదకీయం

# గూగుల్ కు శాంసంగ్ గుడ్ బై చెప్పనుందా? అదే జరిగితే దిమ్మ తిరిగే షాక్

ప్లాట్ ఫాం ఏదైనా సెర్చింజన్ అన్నంతనే గూగుల్ అన్న మాట నోట రావటం కొన్నేళ్లుగా కామన్ కావటం తెలిసిందే. అయితే.. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అదే విషయాన్ని తాజాగా గుర్తుకు చేస్తోంది మైక్రోసాఫ్ట్. ఇప్పటివరకు సెర్చింజన్లలో తిరుగులేని అధిక్యతను ప్రదర్శిస్తున్న గూగుల్ కు దిమ్మ తిరిగే షాకిచ్చేందుకు మైక్రోసాఫ్ట్ సిద్ధం కావటం తెలిసిందే. అన్ లైన్ లో సమాచారం అడిగినంతనే.. బోలెడంత సమాచారాన్ని అందించే గూగుల్ కు.. మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన చాట్ జీపీటీ రూపంలో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు. అదెలా అంటే.. ఏదైనా విషయాన్ని చాట్ జీపీటీని అడిగినంతనే.. సరైన సమాచారాన్ని క్లుప్తంగా ఇస్తోంది చాట్ జీపీటీ. అదే సమయంలో గూగుల్ విషయానికి వస్తే.. ఏదైనా సమాచారం గురించి అడిగితే.. కుప్పలు కుప్పలుగా సమాచారాన్ని పడేయటమే తప్పించి.. మరింకేమీ చేయదు. అదే.. మైక్రోసాఫ్ట్ కు చెందిన చాట్ జీపీటీ మాత్రం.. అడిగిన వివరాలకు సంబంధించిన సమాచారాన్ని కుప్లంగా స్పష్టంగా ఇవ్వటం ఇప్పటి తరానికి తెగ నచ్చేస్తుంది. దీంతో అందరు ఇప్పుడు చాట్ జీపీటీని వాడేందుకు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో.. టెక్ కంపెనీలు తమ తీరును మార్చుకుంటున్నాయి. ఇంతకాలం గూగుల్ కు మించిన సెర్చింజన్ మరొకటి లేదనే వాదనకు తలొగ్గే పరిస్థితి. ఇప్పుడు చాట్ జీపీటీ వచ్చి దాని అధిక్యతను సవాలు విసిరింది. చాట్ జీపీటీ సత్తా తెలిసిన టెక్ కంపెనీలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా మొబైల్ ప్రపంచంలో మంచి పేరున్న సంస్థల్లో ఒకటిగా ఉన్న శాంసంగ్ తన తాజా సీరిస్ లో డిఫాల్ట్ సెర్చింజన్ గా మైక్రోసాఫ్ట్ కు చెందిన బింగ్ యాప్ ను వాడేందుకు వీలుగా సమాచాలోచనలు చేస్తోంది. ఇంతకాలం శాంసంగ్ ఫోన్లలో సెర్చి ఆప్షన్లలో గూగుల్ ఉండేది. అందుకు భిన్నంగా ఇప్పుడు బింగ్ ను ఇవ్వటం.. దానికి అదనంగా చాట్ జీపీటీ అందుబాటులోకి రావటంతో.. దాని మీద యూజర్ల ఆసక్తి పెరిగింది. దీనికి తగ్గట్లే శాంసంగ్ సంస్థ తమ ఫోన్లలో గూగుల్ కు బదులుగా మైక్రోసాఫ్ట్ బింగ్ ను ఉంచేందుకు వీలుగా చర్చలు జరుగుతోంది. అదే జరిగితే.. గూగుల్ కు భారీ షాక్ తప్పదంటున్నారు. ఒక అంచనా ప్రకారం శాంసంగ్ తో మైక్రోసాఫ్ట్ డీల్ సెట్ అయితే..గూగుల్ కు దాదాపు రూ.300 కోట్లు నష్టపోవటం ఖాయమంటున్నారు. ఈ భారీ మొత్తాన్ని గూగుల్ కోల్పోవటం ఏ మాత్రం క్షేమకరం కాదన్న మాట వినిపిస్తోంది. మరి.. దీనికి శాంసంగ్ ఎలా రియాక్టు అవుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్న.

# మధుర ఫలం.. చేదు ఫలితం



కరీంనగర్ : ధాన్యం పండించిన రైతులనే కాదు..కాతనే నమ్ముకున్న మామిడి రైతుల్ని ఈ సీజన్ బోల్తా కొట్టిస్తోంది. అకాల వర్షం, పూసిన పూతకు తెగుళ్లు ఆవహించడంతో కష్టనష్టాల్లోకి నెట్టేస్తోంది. ఎన్నో ఆశలతో ఈ సారి గణనీయమైన దిగుబడి ఉంటుందని ఆశించిన వారందరికి నిరాశే మిగిలింది. నిండుగా కాత ఉన్న చెట్లపై వడగండ్ల వానలు, గాలి దూమారాలు ప్రతాపాన్ని చూపించాయి. కొమ్మలు విరిగేలా కాసిన కాయల్ని నేలరాల్చాయి. పలు రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే వెళ్లే ఈ తీపి పండుకు ఈ సారి ఊహించని విధంగా చేదు అనుభవమే ఎదురవుతోంది. ఇది.. జగిత్యాలలోని మార్కెట్‌లోని ఓ వ్యాపారికి కేటాయించిన స్థలం. అనుకున్న విధంగా ఈసారి మామిడి దిగుబడి లేకపోవడంతో ఇలా.. చూద్దామన్న ఒక్క కాయ కూడా కనిపించడంలేదు. గత సీజన్‌లో ఎటు చూసినా మధుర ఫలాల హవానే కనిపించేది. అలాంటిదిప్పుడు ఉన్న 100 దుకాణాల్లో సగానికన్నా ఎక్కువ దుకాణాల్లో అనుకున్న విధంగా గిరాకీ లేనేలేదు. ఇక వచ్చిన వాటిని రాత్రి వేళల్లో ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక తోటలుండే జగిత్యాల జిల్లాలో ఈసారి పెట్టుబడి పెట్టిన మొత్తం కూడా రైతు చేతికందట్లేదు.

### ఎగుమతికి ఎదురు చూపులే..!

ప్రతి ఏడాది జగిత్యాల జిల్లా నుంచి వెళ్లే మామిడిపై అన్ని ప్రాంతాల వ్యాపారులు గంపెడాశల్ని పెట్టుకుంటారు. తోటను గుత్తకు తీసుకున్న రైతులతోపాటు వ్యాపారులు, క్రయవిక్రయాలపై ఆధారపడే చిరువ్యాపారులు, కార్మికులు ఈసారి మామిడి అనుకున్న విధంగా మార్కెట్‌లో లభించకపోవడంతో దిగాలు చెందుతున్నారు. ముఖ్యంగా గతేడాది ఏప్రిల్ మాసం చివరి నాటికి సుమారు 11 వేల టన్నుల మామిడిని ఎగుమతి చేయగా ఈసారి ఏప్రిల్ నెలాకరు వరకు కేవలం 2,783 టన్నులను మాత్రమే పంపించారు. మే నెలలో ఇదే సమయానికి 23వేల టన్నుల మామిడిని ఇతర ప్రాంతాలకు పంపేలా వ్యాపారం సాగగా.. ఈసారి 7,500 టన్నులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాదాపుగా 30శాతం మేర వ్యాపార పురోగతి ఈ సీజన్‌లో కనిపిస్తోంది. చాలా తోటల్లో ఎకరానికి 3 నుంచి 4 టన్నుల కాయలు రావాల్సి ఉండగా.. ఈసారి ఎకరానికి టన్ను కాయలు రావడమనేది గగనంగా మారింది. గతేడాది నవంబరు మాసం వరకు వర్షాలు కురియడంతో నేలలో తేమ ప్రభావం వల్ల చిగుర్లు అధికంగా రావడం, ఆలస్యంగా వచ్చిన పూతకు తేనె మంచు పురుగు ఆశించడంతో నష్టం వాటిల్లినట్లు శాస్త్రజ్ఞులు తెలిపారు. పైగా విపరీతంగా పెరిగిన ఎండలకు పూత రాలడంతో ఈ దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఫిబ్రవరి నెలలో వారం రోజుల పాటున్న వాతావరణ పరిస్థితులతో ఊహించని నష్టం మామిడి రైతులకు వాటిల్లిందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

### దొరకడమే కష్టమవుతోంది– అబ్దుల్ రహీం, వ్యాపారి, జగిత్యాల

ఎప్పుడూలేని విధంగా ఈసారి మామిడి కాయ మార్కెట్‌కు రావడమనేది కష్టమవుతోంది. గతంలో మార్కెట్ మామిడిని రైతు తీసుకొస్తే కొనుగోలు కోసం తటపటాయించే వాళ్లం. ఇప్పుడు మేమే ఆయా గ్రామాలకు వెళ్లి ఏ తోటలో కాయలున్నాయని వెతికి.. వాటిని కొని తెచ్చే పరిస్థితి నెలకొంది. ఒక్కో రోజుకు 300 టన్నులు వెళ్లిన సందర్భాలున్నాయి. ఇప్పుడు 10 టన్నులు పంపడం కూడా సాధ్యపడటం లేదు. నిత్యం లారీ వెళ్లడం లేదు. రెండు మూడు రోజులకోసారి లారీ కాయల్ని నింపాల్సిన పరిస్థితి ఈసారి ఎదురైంది.

### కాతలేకనే ఈ రకమైన ఇబ్బంది– సత్యనారాయణ, వ్యాపారి, జగిత్యాల

ఈసారి ఇంతలా ఇబ్బంది ఉంటదని ఊహించలేదు. మార్కెట్‌లో కాయ కనిపిస్తే అది బంగారంలా మారింది. 30 తోటలను తిరిగితే ఒక్క తోటలో కాయలుంటున్నాయి. గతంలో పూత బాగానే కనిపించిన తోటల్లో ఒక్క కాయ కూడా కాయలేదు. లారీలను నింపడం కూడా కష్టమవుతోంది. అందుకనే చిన్న వ్యాన్‌లు నిండగానే పంపిస్తున్నాం. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కార్మికులకు కూడా సరైన ఉపాధి ఉండటం లేదు. సరైన పనిలేక గంటల తరబడి ఖాళీగా ఉంటున్నారు. మార్కెట్‌లో ఇలాంటి ఇబ్బందికర పరిస్థితి ఎన్నడూ లేదు.

# అద్దె నామమాత్రం.. నిర్వహణ పెనుభారం



కరీంనగర్ : ఐటీ టవర్ ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంత యువతీ యువకుల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కల నెరవేరబోతుందని భావించిన వారికి నిరాశే మిగులుతోంది. కేవలం మెట్రో నగరాల్లోనే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ పరిశ్రమలకు ఊతం ఇవ్వాలన్న సదుద్దేశంతో 25కోట్ల రూపాయలతో నిర్మించినప్పటికి ఆచరణలో మాత్రం ఔత్సాహికులకు సరైన ప్రోత్సాహం లభించడం లేదు. దీంతో ప్రారంభం సందర్భంలో 20 కంపెనీల వరకు తమ పేర్లను నమోదు చేసుకున్నా ప్రస్తుతం 10 కంపెనీలు మాత్రమే తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. జీప్లస్5 అంతస్తుల్లో సుమారు 50వేల చదరపుటడుగుల వైశాల్యంలో నిర్మించారు. ప్రతి అంతస్తులో 10వేల చదరపుటడుగులు నిర్మించారు. ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో కంపెనీలు తమ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని సూచించారు. అద్దె నామమాత్రంగా ఉంటుందని చెప్పడమే కాకుండా ఇంటర్నెట్, విద్యుత్తు తదితర సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించడంతో చాలా వరకు ఔత్సాహికులు ఆనందపడిపోయారు. ప్రస్తుతం పరిస్థితి దానికి భిన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసుకొంటే నామమాత్రపు అద్దె చదరపుటడుగుకు 13రూపాయలు వసూలు చేస్తుండగా నిర్వహణ ఛార్జీలంటూ ఒక్కో చదరపుటడుగుకు 15రూపాయలు వడ్డిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌తో సమానంగా ఇక్కడ నిర్వహణ ఛార్జీలు వసూలు చేస్తుండటంతో చాలా కంపెనీలు వెనక్కి మళ్లిపోతున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం అయిదు అంతస్తుల్లో ఒక్కో అంతస్తుకు ఒకటి రెండు కంపెనీలు కొనసాగతుండగా దాదాపు 400మంది అందులో ఉపాధి పొందుతున్నారు. కంపెనీల్లో నిర్వహణ కేవలం మిధ్యగానే మిగిలిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు విద్యుత్తు,ఇంటర్నెట్ ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఏ కంపెనీకి ఆ కంపెనీకి సబ్‌మీటర్ పెట్టాలని కంపెనీలు కోరుతుండగా దానికి కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదంటున్నారు. వందల మంది పని చేసే ఐటీ కంపెనీలో కేవలం ఒక్కో అంతస్తుకు ఒకటే వాష్‌రూం ఏర్పాటు చేయడం పట్ల కంపెనీ యజమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో షిఫ్టుకు 1200మంది చొప్పున మూడు షిఫ్టుల్లో 3600మందికి ఉపాధి లభిస్తుందని ముమ్మర ప్రచారం జరిగినా కేవలం 400మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు..

### నిర్వహణ ఖర్చు తగ్గించి సెజ్‌గా ప్రకటిస్తే ప్రయోజనం

ప్రస్తుతం ఉన్న ఐటీ హబ్ లో కంపెనీల నిర్వాహకులు ఐటీ హబ్ కాకుండా సెజ్‌గా ప్రకటిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని సూచిస్తున్నారు. ప్రస్తుతం అద్దెపై 18శాతం,నిర్వహణపై 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోందంటున్నారు. సెజ్‌గా ప్రకటిస్తే జీఎస్టీ చెల్లించడం వసూలు చేయడం ఉండబోదని అంటున్నారు. వరంగల్‌లో నిర్వహణ ఖర్చు చదరపుటడుగుకు 12రూపాయలు వసూలు చేస్తుండగా కరీంనగర్‌లో 15వసూలు చేయడం దారుణమని అన్నారు. ఆయా కంపెనీలకు వేర్వేరు సబ్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఛార్జీలు వసూలు చేస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. అంతేకాకుండా విద్యుత్తు,ఇంటర్నెట్ ఛార్జీలు అదనంగా వసూలు చేస్తున్నప్పుడు ఇంకా నిర్వహణ ఛార్జీలంటూ భారం వేయడంతో కంపెనీలు ఏర్పాటు చేయడం ఇబ్బందిగా ఉందని అంటున్నారు.

# ఇరుకు రోడ్లు... ఆపై వ్యాపారుల ఇష్టారాజ్యం

వేములవాడ : ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న వేములవాడ పట్టణంలో చాలా వరకు ఇరుకు రోడ్లలో ఇరువైపులా వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. దీంతో మరింత ఇబ్బంది ఏర్పడి భక్తులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు తోపుడు బండ్ల వర్తకులు రహదారిపైనే వ్యాపారం కొనసాగించడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. అయినా ఇటు పురపాలక సంఘం అధికారులు గానీ, అటు పోలీసులు గానీ పట్టించుకున్న పాపానపోలేదు. దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిగా భక్తులు, వివిధ అవసరాల కోసం ప్రజలు వేములవాడకు వస్తుంటారు. ఇరుకు రోడ్లతో పట్టణానికి వచ్చిపోయే వారికి ఇబ్బందిగా మారుతోంది. ముఖ్యంగా రోడ్లను ఆక్రమించి దుకాణాలు నిర్వహించడం, యథేచ్ఛగా తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు కొనసాగించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ ఆక్రమిస్తున్నారు. దీంతో పట్టణానికి పెద్ద ఎత్తున వచ్చే భక్తులు, వాహనదారులు, ఇతర అవసరాల కోసం వచ్చే ప్రజలు ఆయా మార్గాల్లో వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ట్రాఫిక్‌లో ఇరుక్కుంటే చాలా సమయం అందులోనే ఉండిపోవాల్సిన పరిస్థితి భక్తులను, ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

# పల్లెలు పావనం


ఖమ్మం : పచ్చదనం పెంచడంతోపాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలనే లక్ష్యంతో గ్రామాలు, మండల కేంద్రాల్లో పల్లె, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. రెండేళ్ల క్రితం చేపట్టిన ఈ పనులతో గ్రామాల్లో పచ్చని చెట్లతో ఉద్యానవనాలు ఏర్పడుతున్నాయి. జిల్లాలో కొత్తగా పల్లె ప్రకృతి వనాలు, మండలానికి నాలుగు చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారు.

### జిల్లాలో స్థలాల గుర్తింపు

ఇందులో భాగంగా 41 పల్లె ప్రకృతి వనాల కోసం స్థలాలను గుర్తించారు. వాటితోపాటు వేంసూరులో 4, కల్లూరులో 3, ఏన్కూరు, నేలకొండపల్లి, రఘునాథపాలెం, కారేపల్లి, పెనుబల్లి, సత్తుపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాల కోసం మొత్తం 14 స్థలాలను గుర్తించారు. మిగిలిన వాటి కోసం రెవెన్యూ అధికారుల సహకారంతో స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు.

### మండల కేంద్రాల్లో 18 నిర్మాణాలు

మండల కేంద్రాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్మాణాలు చేపట్టారు. ప్రజలకు ఉపయోగపడేలా 5 నుంచి 7 ఎకరాల విస్తీర్ణంలో




రూ.25లక్షలతో చిట్టడవిని తలపించేలా వివిధ రకాల చెట్లను నాటడంతోపాటు, ప్రజలు సేదతీరేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 18 వనాలను నిర్మించారు. వైరా, ముదిగొండ మండల కేంద్రాల్లో పనులు పెండింగులో ఉన్నాయి. రఘునాథపాలెంలో 14ఎకరాల విస్తీర్ణంలో రూ.1.25కోట్లతో మినీ ట్యాంక్‌బండ్, ఓపెన్ జిమ్, పిల్లల పార్క్, తల్లీబిడ్డల బొమ్మ, హ్యాండ్ వాటర్ ఫాల్ ఫౌంటెయిన్, డ్రిప్, 50రకాల 23వేల మొక్కలు నాటి, 1.5కిమీ వాక్‌వేతో ఆదర్శంగా తీర్చిదిద్దారు.

### గ్రామాల్లో 754 పూర్తి

ప్రతి పంచాయతీలో పల్లె ప్రకృతి వనాల నిర్మాణం చేపట్టారు. అరెకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో గ్రామ ప్రజలు, చిన్నారులు సేద తీరేలా వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాలోని 20 మండలాల్లో 754 పల్లె ప్రకృతి వనాలను పూర్తి చేశారు.

# కమ్ముకున్న మేఘాలు... అన్నదాతల్లో ఆందోళన

సిరిసిల్ల : జిల్లాలో వర్షం ఎప్పుడు పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను రైతులు విక్రయించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచితే ఏటా యాసంగిలో అకాల వర్షాల వల్ల వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే మూడు సార్లు కురిసిన వర్షాలకు కోనరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, రుద్రంగి, తంగళ్లపల్లి మండలాల్లో ధాన్యం తడిసి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో ప్రస్తుత యాసంగిలో లక్షా 18 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఈ సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా ఐకేపీ, సింగిల్‌విండో, డీసీఎంఎస్, మెప్మా, ఏఎంసీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో మొత్తం 265 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరణను ప్రారంభించారు. జిల్లాలో కొన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో వర్షం కురిస్తే వడ్లు తడవడంతోపాటు కుప్పల కిందకు నీరు చేరుతుందని రైతులు చెబుతున్నారు. నీరు చేరడం వల్ల తడిసినవి నాణ్యత తగ్గి విక్రయానికి ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం త్వరగా రైస్ మిల్లులకు సరఫరా చేయకపోవడంతో కొనుగోళ్లలో ఆలస్యం అవుతుందని, రోజుకు ఒక్క లారీ కూడా సరిగ్గా రావడం లేదని రైతులు వాపోతున్నారు.



ఈనేపథ్యంలో కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను త్వరగా తరలించడంపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని, వర్షం నుంచి ధాన్యం కాపాడుకునేలా తగినన్ని టార్పాలిన్లు సరఫరా చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

### లారీల కొరతతోనే ఇబ్బంది...– అమరగొండ ప్రశాంత్, రైతు మండెపల్లి

నేను 20 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులు అవుతుంది. ఇక్కడ తాలు పట్టే యంత్రం ఒక్కటే ఉండటం వల్ల ఆలస్యం అవుతుంది. దీనికి తోడు దినం తప్పించి దినం ఒక్క లారీ వస్తుంది. తాలు పట్టి తేమ శాతం వచ్చిన వారివి తూకం వేయడానికి లైన్ ఉంది. మరో వైపు ఆరబెట్టిన వడ్లు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మాకు న్యాయం చేయాలి.

### ఇరవై రోజులు అవుతుంది– సల్లూరి ఆంజనేయులు, రైతు

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి ఇరవై రోజులు అవుతుంది. కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. ఓవైపు మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. టార్పాలిన్లు కప్పినా వర్షం నీరు వడ్ల కుప్పల కిందకు చేరి తడిసిపోతున్నాయి. కొనుగోళ్లు వేగవంతం చేయాలి.

# గత సమస్యలు పునరావృతం కావొద్దు..!

మహబూబాబాద్: యాసంగి వరి కోతలు ముమ్మరమయ్యాయి.. చేతికొచ్చిన ధాన్యం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. జిల్లా వ్యాప్తంగా 234 కేంద్రాలను ఏర్పాటు చేసి 1.80 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పౌరసరఫరాలశాఖ సిద్ధమైంది. తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో కేంద్రాలను ప్రారంభించింది. మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్–ఏ రకానికి రూ. 2060, సాధారణం రూ.2040గా నిర్ణయించారు. గత వానాకాలంలో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా చినిగిన గన్నీ సంచులతో అవస్థలు పడ్డారు. నిబంధనల ప్రకారం తూకం వేయాల్సిన నిర్వాహకులు తాలు, తేమ సాకుతో అధిక తూకం వేస్తూ నష్టపరిచారు. సకాలంలో ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ఈ యాసంగి కొనుగోళ్లలో గత సమస్యలు పునరావృతం సాఫీగా కొనుగోలు చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**తూకం సజావుగా వేయాలి**

గత వానాకాలంలో మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అదనంగా తూకం వేశారు. నిబంధనల ప్రకారం ఒక్కో బస్తాను 40.700 కిలోల చొప్పున తూకం వేయాలి. కాని పలు కేంద్రాల్లోని నిర్వాహకులు మిల్లర్ల పేరు చెబుతూ కిలో అదనంగా తూకం వేశారని రైతులు ఆరోపించారు.



కేసముద్రం మండలం అన్నారంలో ఒక్కో బస్తా 4 కిలోలు ఎక్కువ బరువు వచ్చేలా నిర్వాహకులు ప్రైవేటు మోకానిక్‌తో బరువు తూచే యంత్రంలో మార్పు చేయించారు. ఒక రైతుకు వచ్చిన అనుమానంతో బహిర్గతమైంది. ఈసారి అలాంటివి జరగకుండా నిబంధనల ప్రకారం తూకం జరిగేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**రవాణా కష్టాలు రానివ్వొద్దు**

అన్నదాతలకు ప్రతిసారి రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. సకాలంలో లారీలు రాకపోవడంతో కేంద్రాల వద్దనే తూకం వేసిన బస్తాల నిల్వలు పేరుకుపోతుండడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. చివరకు రైతులే అద్దెకు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని బస్తాలను మిల్లులకు తరలించిన ఘటనలుంటున్నాయి. ఈసారి ఆ కష్టాలు రాకుండా అధికారులు ముందస్తుగానే ట్రాన్స్‌ఫోర్టు గుత్తేదారులతో మాట్లాడి లారీలు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**మంచి సంచులు వచ్చేనా..?** జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు 45 లక్షల గోనె సంచులు అవసరముండగా ప్రస్తుతం 27 లక్షలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొత్తవి 12 లక్షలు, పాతవి 15 లక్షలున్నాయి. గత వానాకాలంలో నెల్లికుదురు పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రంలోని గన్నీ సంచుల్లో అధికంగా చిల్లులు పడినవే ఉన్నాయి. 50 సంచుల కట్టలో 10 నుంచి 15 వరకు చిల్లులు పడినవే వచ్చాయని అన్నదాతలు వాపోయారు. సంచులతో పీఏసీఎస్ అధికారులకు కష్టాలు తప్పడం లేదు. ఒక్కో కట్టలో 50 చొప్పున ఉంటాయని లెక్కించి ఇచ్చినా అందులో 5 నుంచి 6 తక్కువగా వస్తాయని.. 10 వరకు చిరిగినవి ఉంటాయని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ యాసంగిలో అలాంటి సమస్య తలెత్తకుండా మంచి సంచులను అందించాలని రైతులు కోరుతున్నారు.

# ప్రారంభం కాని కేంద్రాలు.. ధాన్యం దళారులపాలు

గంగాధర : యాసంగిలో తెగుళ్లు, చీడపీడలతో పెట్టుబడి రెట్టింపు అయింది. మధ్యలో సాగునీటి కొరత, వడగళ్ల వానలతో పంటలకు నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదు. ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. వీటన్నింటికి తోడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు ధాన్యానికి రూ.2,060 కాగా దళారులు రూ.1600 చెల్లించి కొంటున్నారు. ఇక సంచికి 2 కిలోల ధాన్యం కోత, కాంటా తూకంలో మోసాలు అదనం. ఇవీ ప్రస్తుతం రైతుల దయనీయ పరిస్థితి.

**భారీగా తగ్గిన దిగుబడులు** జిల్లాలో ఈసారి గతం కన్నా 2,46,893 ఎకరాల్లో ఎక్కువ వరి పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడులు వెచ్చించారు. వడగళ్ల వానలతో 13,377 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. దీనికితోడు మొగిపురుగు ఉద్ధృతితో వరికంకులు ఊస తిరిగి పంటకు నష్టం వాటిల్లింది. నాలుగైదుసార్లు పురుగు మందులు చల్లినా తెగుళ్ల నివారణ సాధ్యం కాలేదు. అగ్గితెగులు, మెడవిరుపు, పంట కోత సమయంలో దోమపోటుతో పంట ఉత్పత్తిలో నాణ్యత తగ్గింది. యాసంగిలో ఎకరాకు 30 క్వింటాళ్ల పైబడి దిగుబడులు రావాల్సి ఉండగా ఈసారి 20 క్వింటాళ్లలోపు మాత్రమే వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించడం వల్ల క్వింటాలుకు రూ.1,600 ధర చెల్లిస్తుండగా ఎకరాకు 18 క్వింటాళ్ల చొప్పున రూ.28,800 వేలు రైతుకు దక్కుతుంది. పెట్టుబడి రూ.25 వేలు పోనూ మిగిలేది కేవలం 3,300లే అని, వ్యవ'సాయం'పైనే ఆధారపడితే ఇక ఓదార్పు ఎక్కడిదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆ ఊరంతా ప్రైవేటుకే..** గంగాధర మండలంలోని పోతుగంటిపల్లికి చెందిన రైతులు ముందుగానే వరిపంట సాగు చేసి కోతలు పూర్తి చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యేంతవరకు గతంలో అనుభవించిన కష్టాలను గుర్తు చేసుకుంటున్న రైతులు దళారులను ఆశ్రయించారు. ఇప్పటికే 12 లారీల్లో 1,550 క్వింటాళ్ల ధాన్యం ప్రైవేటు వ్యాపారులకు 12 మంది రైతులు అమ్ముకున్నారు. మిగిలిన 16 మంది రైతులు ప్రైవేటు వ్యాపారులనే ఆశ్రయించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తెగుళ్లతో ధాన్యంలో నాణ్యత లేక తాలు రావడం, ప్రభుత్వ కేంద్రంలో కొర్రీలు ఇవన్నీ పడలేకే తక్కువ ధరకైనా అమ్ముకుంటున్నామని రైతులు తెలిపారు.

**దిగుబడి తగ్గిందిరాజు, పోతుగంటిపల్లి**

ప్రభుత్వ మద్దతు ధర రూ.2,060 ఉంది. ఈసారి మూడెకరాల్లో వరిపంట కోస్తే 80 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. గతంలో ప్రభుత్వ కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే 28 బస్తాల ధాన్యం తరుగు తీసి నష్టపరిచారు. తప్పని పరిస్థితుల్లో నష్టమైనా అమ్ముకుంటున్నాం.

**కేంద్రాల ఏర్పాటులో జాప్యంఅంజిరెడ్డి**

రెండెకరాల్లో వరిపంట వేస్తే వడగళ్ల వానలకు పంట దెబ్బతిని నష్టం జరిగింది. పంటంతా పోతేనే నష్టపరిహారం ఇస్తామని అధికారులు కొర్రీలు పెట్టారు. మొగిపురుగు, దోమపోటు, మెడవిరుపుతో ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. కొనుగోలు కేంద్రం ఏర్పాటు జాప్యంతో ప్రైవేటు వ్యాపారికే ధాన్యం విక్రయించాం.

# 'మిషన్ వాత్సల్య'కు ప్రచారం కరవు




వరంగల్ : జిల్లాలోని తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన, దీర్ఘకాలిక ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, నిరాశ్రయులైన 18ఏళ్లలోపు అనాథ బాలలకు ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకానికి రూపకల్పన చేశాయి. కేంద్ర శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా అభాగ్యులకు నెలకు రూ.4వేల చొప్పున అందిస్తారు. అయితే 2011 నుంచి గతేడాది వరకు రాష్ట్రంలో జిల్లాస్థాయిలోని అనాథలను గుర్తించి జిల్లా సంక్షేమ శాఖకు కేటాయించిన బడ్జెట్ అనుసారంగా 'సమగ్ర బాలల రక్షణ పథకం' అమలుచేసేవారు. తదనంతరం ఈ పథకమే మిషన్ వాత్సల్య పథకంగా అమలవుతోంది. అయితే ఈ పథకం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో 2021–22ఏడాదికి జిల్లాలో కేవలం 35 మంది అనాథ చిన్నారులే లబ్ధిపొందారు. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు వారికి నెలకు కేవలం రూ.వెయ్యి చొప్పున మంజూరుచేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పథకానికి విస్తృతమైన ప్రచారం లేకపోవడంతో అర్హులు నష్టపోతున్నారు. పూర్తిస్థాయిలో పథకం అమలుకు ప్రచారం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

**అమలుకు మార్గదర్శకాలివే..**

పథకాన్ని అమలుచేసేందుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించనున్నాయి. తద్వారా జిల్లాలోని సుమారు 128 మంది అనాథలు, 175మంది తల్లి లేదా తండ్రి లేని చిన్నారులకు లబ్ధి చేకూరనుంది. పథకానికి దరఖాస్తు చేసుకునే వారి సంరక్షకుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణాల్లో రూ.96 వేలకు మించకూడదు. ఎంపికైన చిన్నారులకు 18 ఏళ్లు నిండేవరకు పథకం వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో విద్యనభ్యసించే చిన్నారులను అనర్హులుగా గుర్తిస్తారు. వరుసగా 30 రోజులు పాఠశాలకు గైర్హాజరు అయినా నిలిపివేస్తారు. చిన్నారుల పూర్తి వివరాలు ఆధార్, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, ఆదాయం, సంరక్షకులతో జాయింట్ అకౌంట్ తదితర వివరాలతో కూడిన పత్రాలను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలి.

**సమాచారం ఇవ్వడం లేదు...చిటికేషి పావని, ఎల్లంబజార్, వరంగల్**

కొన్నేళ్ల క్రితం నాభర్త మృతి చెందారు. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఇంటర్మీడియట్ రెండో ఏడాది. ఇంకొకరు పదో తరగతి చదువుతున్నారు. మిషన్ వాత్సల్య పథకం గురించి తెలిసిన వాళ్లు కొందరు నాకు చెప్పారు. పిల్లల చదువుకు, ఆర్థికంగా ఎంతో కొంత లబ్ధి చేకూరుతుందని పథకానికి దరఖాస్తు చేసేందుకు వారం నుంచి ప్రయత్నిస్తున్నాను. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా సరైన సమాచారం ఇవ్వడంలేదు.

**30లోపు దరఖాస్తు చేసుకోవాలి–ఎం.శారద, జిల్లా సంక్షేమశాఖ అధికారి**

అభ్యర్థులు ఈనెల 30లోపు దగ్గర్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుంది. గతంలో అనాథలు, తల్లి లేదా తండ్రి లేని చిన్నారులకు రూ.2 వేలు చొప్పున అందించాం. ప్రస్తుతం ప్రభుత్వం పథకానికి కేటాయించే బడ్జెట్ మేరకు లబ్ధిదారులను ఎంపికచేసి ఆర్థిక సహాయం అందిస్తాం.

# ఏసీ బస్సుల్లో ఉక్కపోత!




వరంగల్ : వరంగల్ రీజియన్ నుంచి నడుస్తున్న ఏసీ బస్సులకు సరైనమరమ్మతులు, నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా తమ గోడును చెబుతుండగా.. చాలా మంది మౌనంగా భరిస్తున్నారు. ఏప్రిల్ రావడంతో భానుడి భగభగలు పెరిగిపోయాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ నేపథ్యంలో సుదూరాలకు ప్రయాణించే వారు డబ్బులు ఖర్చయినా ఫర్వాలేదుగానీ ప్రయాణం సుఖవంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఆర్టీసీ సైతం ఏసీ ట్రిప్పుల సంఖ్యను పెంచింది. వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదు.

**తరచూ మొరాయింపులు**

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2 డిపోల పరిధిలో మాత్రమే ప్రస్తుతం ఏసీ బస్సులు నడుస్తున్నాయి. మొత్తం 47 ఉన్నాయి. ఏసీ రాజధానిలో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రూ.370, గరుడ బస్సుకు రూ.430, బెంగళూరు వెళ్లడానికి రూ.12 50 ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని సెస్ పేరుతో అదనపు వసూలు చేస్తున్నారు. ఇందులో ప్రయాణించే వారికి వాటర్‌బాటిల్, ఏసీ ఎక్కువగా ఉన్నప్పుడు కప్పుకోవడానికి ఓ బెడ్ షీట్ ఇవ్వాలి. వినోదం కోసం టీవీలు ఏర్పాటు చేయాలి. ఇందులో ఎలాంటి అసౌకర్యాలు కలిగినా వెంటనే పరిష్కరించాలి.

**మరికొన్ని ఇబ్బందులు**

వెనక వైపు కూర్చున్న వారికి ఏసీ రావడంలేదు.

చాలావాటిలో చరవాణి ఛార్జింగ్ పెట్టుకునే పిన్ పనిచేయడంలేదు.

వాటర్ బాటిల్ డ్రైవర్ వద్ద ఉంటుంది. అవసరం ఉన్న వారే తెచ్చుకోవాలి. అడగని వారుంటే ఇక అంతే. అవి ప్రయాణికులకు ఇచ్చే వారు కూడా లేరు.

తరచూ మొరాయిస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో మూడు చోట్ల మూడు బస్సులను సాంకేతిక కారణాలతో మధ్యలో ఆపి ప్రయాణికులను ఇతర బస్సుల్లో పంపించారు.

సీట్ల ముందు భాగంలో వాటర్ బాటిల్ పెట్టుకునే బాస్కెట్లు దెబ్బతిన్నాయి.

ఇటీవల సిటీ వోల్వా బస్సులను రాజధానిగా మార్చి వాటిని దూర ప్రాంతాలకు నడిపిస్తున్నారు. ఈ బస్సుల్లో టీవీలు లేవు, సీట్లు సైతం పుష్‌బ్యాక్ కావడంలేదు. ఈ బస్సులు రీజియన్‌లో 14 వరకు ఉన్నాయి.

**టీవీలూ రావడం లేదు**

వినోదం కోసం ఏర్పాటు చేసిన టీవీలు మూగబోయాయి. మరికొన్నింటిలో మొరాయిస్తున్నాయి. కొన్నింటిలో రీసౌండ్ వచ్చి ప్రయాణికులకు అర్థంకాక చికాకు పుట్టిస్తున్నాయి. చక్కటి వినోదం, ఆహ్లాదం అందిస్తామని ఆర్టీసీతో ఒప్పందం చేసుకున్న గుత్తేదారులు నెలవారీగా వచ్చే కాసులపై చూపించే శ్రద్ధ ప్రయాణికుల సౌకర్యాలపై చూపించడంలేదు.

**అధికారులు దృష్టి పెట్టాలి – పి.సతీష్, ప్రయాణికుడు**

నేను ఇటీవల హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ఏసీ రాజధాని బస్సులో ప్రయాణించా. అందులో టీవీ పని చేయడంలేదు. చరవాణి ఛార్జింగ్ పెట్టుకుందామంటే అదీ పని చేయలేదు. కొన్ని సీట్లు సైతం పుష్‌బ్యాక్ కావడంలేదు, వాటర్ బాటిల్ డ్రైవర్ వద్ద నుంచి తెచ్చుకోవాలి. అధికారులు వీటిపై దృష్టి సారించి సరిచేయాలి.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్విటర్ ఖాతాకు ఒక ప్రయాణికుడు చేసిన ట్వీట్ ఇది. తాను హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు తరచూ వెళ్లి వస్తుంటానని, రాజధాని బస్సులో ఏమాత్రం శుభ్రత లేదని.. ఏసీ పనిచేయడం లేదని.. ఆర్డినరీ బస్సులో ప్రయాణం చేసినట్టుగా ఉందని పేర్కొన్నారు. బస్సులో చెల్లాచెదురుగా పడి ఉన్న ప్లాస్టిక్ బాటిళ్ల ఫొటోలనూ ట్వీట్ చేశారు.

ఓ ప్రయాణికుడి ఆవేదన..ఇటీవల ఉప్పల్ నుంచి హనుమకొండకు బయలుదేరిన రాజధాని బస్సులో తరచూ ఏసీ మొరాయించింది. డ్రైవర్‌ను అడిగితే ఇది మామూలేనని.. బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడే ఏసీ ఉంటుందని చెప్పారు. హైదరాబాద్ నుంచి రాజధాని బస్సులో ఇటీవల హనుమకొండకు వచ్చిన ఓ ప్రయాణికుడు తనకు కలిగిన అసౌకర్యాలను వివరిస్తూ స్థానిక స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

# రెండో విడత గొర్రెల పంపిణీ షురూ

నల్గొండ : ప్రజల జీవనోపాధి పెంపొందించడం, వారి ఉపాధి కల్పనకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి యాదగిరి చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న గొర్రెల పంపిణీ, కోడి పిల్లల యూనిట్ల పంపిణీ, పశువుల ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తదితర అంశాలపై ఆయనతో ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలిలా..రాయితీ గొర్రెలను తప్పుదోవ పట్టిస్తే చర్యలునల్గొండ జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో 37,076 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. మునుగోడు నియోజకవర్గంలో 4,800 మందికి గొర్రెలు అందించాల్సి ఉండగా 3,369 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశాం. వారిలో ఇప్పటికే 178 మందికి గొర్రెలను పంపిణీ చేశాం. మిగతా లబ్ధిదారులు కోరుకున్న చోటు నుంచి గొర్రెలను దిగుమతి చేసి పంపిణీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అనంతపురం జిల్లా నుంచి ఎర్ర గొర్రెల సంతతిని లబ్ధిదారులు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. బిల్లులు రాగానే గొర్రెలు చేతులు మారుతున్నాయనే విషయం మా దృష్టికి రాలేదు. కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పశువైద్యుల పర్యవేక్షణలోనే కొనుగోలుదారులు వారికి ఇష్టం వచ్చిన గొర్లను కొనుగోలు చేస్తున్నారు. మొదటి విడతలో పంపిణీ చేసిన గొర్రెలతో లబ్ధిదారులు చాలా వరకు ప్రయోజనం పొందుతున్నారు. ఎక్కడైనా రాయితీ గొర్రెలు చేతులు మారినట్లు తెలిస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. విచారించి బాధ్యులపై చర్యలు చేపడతాం.

**ఔషధాల కొరత లేదు**పశువులు, గొర్రెలు, మేకల చికిత్సకు పశు వైద్యశాలల్లో ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. కుక్కలకు తప్ప పశువులు, మేకలకు అన్ని రకాల మందులు పంపిణీ చేస్తున్నాం. జబ్బు ముదిరితే వాటిని నయం చేసేందుకు ఖరీదైన మందులు అవసరమైనప్పుడు మాత్రమే వాటినిమార్కెటులో తెచ్చుకోమని రైతులకు చెబుతున్నాం. ఎక్కడైనా మందులు ఇవ్వడం లేదంటే మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

# ఇసుక రీచ్‌లలో 'అదనపు బకెట్' దందా!

భూపాలపల్లి : మండలంలోని గోదావరి తీర ప్రాంతాల వెంట ఉన్న ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక లోడింగ్‌లో అదనపు బకెట్ దందా ఆగడం లేదు. గతం నుంచి ఈ పద్ధతి కొనసాగుతున్నా అపుడప్పుడు ఆపేయడం మళ్లీ కొనసాగించడం జరుగుతోంది. ప్రస్తుతం కాళేశ్వరానికి సమీపంలోని తీర ప్రాంతాల్లో 9 ఇసుక రీచ్‌లు కొనసాగుతున్నాయి. గుండ్రాత్‌పల్లి, పల్గుల నాలుగో నంబరు, కుంట్లం 2,3, పల్గులలో 5, 6, 9, 10, 11, 12 సంఖ్యల ఇసుక రీచ్‌ల వెంట నిత్యం ఇసుక లోడింగ్ జరుగుతోంది. రెండు రోజుల క్రితం అదనపు బకెట్ దందాపై ఈ ప్రాంతానికి చెందిన మహేశ్ అనే లారీ యజమాని పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో వైరల్‌గా మారింది. రెండు రీచ్‌ల వెంట అదనపు బకెట్ కోసం రూ.2000 నుంచి రూ.2500 తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొనడంతో దందా వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే 9 రీచ్‌లు నడుస్తుండగా త్వరలో పూస్కుపల్లి వద్ద మరొకటి ప్రారంభం కానుంది. గుండ్రాత్‌పల్లి ఇసుక రీచ్ వద్ద నిల్వలు లేకపోవడంతో మూడు రోజుల్లో ముగుస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా కుంట్లం 2కు త్వరలో తెర పడనుంది. ప్రధానంగా సన్నపు ఇసుక లభ్యమయ్యే రీచ్‌లలో టీయస్ఎండీసీ సిబ్బంది ప్రమేయంతో దందా ఎక్కువగా సాగుతున్నట్లు విమర్శలున్నాయి.. ఒక్కో లారీకి రెండు నుంచి మూడు బకెట్లు అదనంగా వేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ప్రాజెక్టు అధికారి తారక్‌నాథ్‌రెడ్డిని సంప్రదించగా అదనపు బకెట్ దందా అంటూ ఏమీ లేదన్నారు. ఆరోపణల్లో నిజానిజాలు తేలుస్తామన్నారు.

**నష్టపోతున్న కౌలు రైతులు :** ఇసుక డంపింగ్ కోసం రైతులకు భారీ మొత్తంలో కౌలు ఇస్తామని గుత్తేదార్లు ఒప్పందాలు చేసుకొని రైతులకు నగదు చెల్లింపులు చేయడం లేదు. మద్దులపల్లికి చెందిన రైతులకు



గుత్తేదార్లు ఎకరానికి రూ.80 వేలు ఒప్పందం చేసుకొని రెండేళ్లుగా కౌలు దాటవేస్తున్నారని పలువురు రైతులు ఇటీవల ధర్నాకు దిగారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలు కాకపోవడంతో మరో మారు రైతులు భూగర్భ జల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

**అంతర్గత రహదారులు అధ్వానం**

పట్టణంలోని బాంబులగడ్డ, సీఆర్‌నగర్‌కాలనీ, ఆకుదారివాడ తదితర కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కొద్ది పాటి వర్షం పడితే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేపడుతామని గతంలో పురపాలక అధికారులు ప్రకటించినా ఆచరణలో అమలు కాలేదు. ఇప్పటి వరకు కొన్ని కాలనీలు, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించకపోగా, ఉన్న మట్టి రహదారుల్లో మిషన్ భగీరథ పైపులైన్ తవ్వకాల పేరుతో గుంతల మయంగా చేస్తున్నారు. మోకాలు లోతు గుంతలు, బండరాళ్లతో వీధుల గుండా స్థానికులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓసీపీ సమీపంలోని మజీదు ప్రాంతంలో మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షం పడితే రోజుల తరబడి రోడ్ల పక్కన మురుగు నీరు నిలిచిపోతోంది. బురద నుంచి వచ్చే దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాకతీయఖని సెక్టార్–2 ఓపెన్ కాస్టు గని తవ్వకాల మూలంగా కాకతీయకాలనీ, శాంతినగర్, రెడ్డికాలనీ, గాంధీనగర్ కాలనీ, ఆకుదారివాడ, పక్కీరుగడ్డ, బాలాజీనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం సమయంలో బొగ్గు ఉత్పత్తి కోసం ఓసీ పేలుళ్లతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పేలుళ్ల కారణంగా వచ్చే దుమ్ముదూళీతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పేలుళ్ల సమయంలో ఇళ్లు కదిలినట్లు అనిపిస్తుందని, పలువురి ఇంటి గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. తాగునీటి సరఫరా కోసం కొత్తగా ఏర్పడిన ఇళ్ల వరకు పైపులైన్ ఏర్పాటు చేయటం లేదు. కొద్ది సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు స్థానికులు కొందరు వ్యక్తులు కలిసి సొంతంగా తాగునీటి బోర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఓసీ పేలుళ్ల కారణంతోనే ఇటీవల బోర్‌లలో తాగునీటి చుక్క కనిపించడం లేదు. పలు కాలనీల్లో పదుల సంఖ్యలో తాగునీటి బోర్లు ఎండిపోయాయి.

**నిధులు రాగానే సీసీ రోడ్లు నిర్మిస్తాం..– అవినాష్, మున్సిపల్ కమిషనర్**

పట్టణంలోని అన్ని కార్మిక కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు రూపొందించి ఇటీవల ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదల కాగానే అభివృద్ధి పనులు చేపడుతాం.. తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. నిధుల కొరత కారణంగానే ఇలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

# 'టన్ను' కొస్తున్న దుఃఖం

నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. మూడు జిల్లాల్లో రైతుల కల్లాల్లోనే దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల ఆర్భాటంగా ప్రారంభించినా..కొనుగోళ్లను వేగవంతం చేయడం లేదు. రానున్న రోజుల్లో కోతలు మరింత ముమ్మరం కానున్న దృష్ట్యా పరిస్థితి మరింత జఠిలం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నల్గొండ జిల్లాలోనే కొంత ఆశాజనకంగా కొనుగోళ్లు ఉండగా..భువనగిరి జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా కలిపి మొత్తం 302 కేంద్రాలను ప్రతిపాదించగా..ఇప్పటివరకు ఒక్క కేంద్రంలోనూ కొనుగోళ్లను ప్రారంభించలేదు. ఈ ఒక్క జిల్లాలోనే 50 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కల్లాల్లో ఉంది. సూర్యాపేట జిల్లాలో మొత్తం 276 కేంద్రాలను ప్రతిపాదించగా..అధికారిక లెక్కల ప్రకారం మాత్రం 188 ప్రారంభించినట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. గతంలో ఈ జిల్లాలో అవకతవకలు జరిగిన కేంద్రాలకు ఈ దఫా అధికారులు అనుమతి ఇవ్వలేదు. ఎక్కువగా తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని దాదాపు 12 కొనుగోలు కేంద్రాలకు ఈ ఏడాది అనుమతి ఇవ్వలేదని తెలిసింది. వీటిలో గతేడాది ఏపీ నుంచి అడ్డగోలుగా ధాన్యం తీసుకొచ్చి ఇక్కడ మద్దతు ధరకు అమ్మి కొంత మంది దళారులు సొమ్ము చేసుకున్నారు. హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో గ్రామ సంఘాల వీబీకే (విలేజ్ బుక్ కీపర్)లు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. దీంతో మహిళా సంఘాలకు అధికారులు బాధ్యత అప్పగించారు. వారూ ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను చేపట్టలేదు. అవకతవకలకు జియో ట్యాగింగ్‌తో చెక్ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 56.44 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా.. ఉమ్మడి జిల్లాలోనే 13.20 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. సుమారు 32 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# ఆన... మానవ వనరులకు సాన...!

ఖమ్మం : టీఎస్ జెన్కోలో కొత్తగా నియమితులయ్యే వారికి శిక్షణ తప్పనిసరి. వృత్తిపరమైన, అధునాతన సాంకేతిక మెలకువలను ఉద్యోగులకు ఎప్పటికప్పుడు నేర్పించాల్సిందే. ఇందుకోసం పాల్వంచలోని 'కేటీపీఎస్ సీ కాలనీ'లో ఆధునిక హంగులతో శిక్షణాభివృద్ధికి 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సిమ్యులేటర్), వసతి భవనాలను సిద్ధం చేశారు. ప్రధానంగా విద్యుత్తు రంగంలో ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులు విధుల్లో రాణించేందుకు వృత్తి నైపుణ్య శిక్షణలు దోహదపడతాయి. ఆయా సంస్థలు సైతం ఏటా మానవ వనరులను సానబెట్టేందుకు పక్కా ప్రణాళికతో కార్యక్రమాలు చేపడుతుంటాయి. టీఎస్ జెన్కో కూడా ఇదే కోవకు చెందుతుంది. థర్మల్ విద్యుత్తు వెలుగులకు కేంద్రమైన పాల్వంచలోని కేటీపీఎస్ సీ కాలనీలో 2017 ఏప్రిల్ 12న శిక్షణ తరగతులు ప్రారంభించారు. తొలుత రేకుల షెడ్డులో శిక్షణ ఇవ్వడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. ఏళ్లనాటి క్వార్టర్లలో అరకొర వసతులతో సర్దుకుపోతున్నారు. పూర్తిస్థాయి ఏకాగ్రత చూపలేకపోతున్నారు. కొత్త భవనాలు నిర్మించాలని టీఎస్ జెన్కో యాజమాన్యం భావించింది. ఆధునిక హంగులతో నూతన భవనాలను టీఎస్ జెన్కో అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.6 కోట్లతో చేపట్టే 'సిమ్యులేటర్' నిర్మాణ పనులను 2018 మార్చి 12న బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. 2020లో రూ.6 కోట్లతో వసతి భవన నిర్మాణాన్ని మరో సంస్థ ప్రారంభించింది. మూసేసిన పాల్వంచ కేటీపీఎస్ ఓ అండ్



ఎం కర్మాగారంలోని టర్బైన్, బాయిలర్, ఇతర ప్రధాన పరికరాలను ప్రయోగాత్మకంగా చూపించడానికి శిక్షణ కేంద్రంలో ఉంచింది. ఈ నెలలోనే భవనాలను ప్రారంభించాల్సి ఉన్నా పీఆర్సీపై ఇంజినీరింగ్, ఉద్యోగ సంఘాలు, డిమాండ్ల సాధనకు ఆర్టిజన్లు పోరుబాట పట్టడంతో జాప్యం జరిగే అవకాశముంది.

అన్ని విద్యుత్కేంద్రాల ఉద్యోగులకు.. రాష్ట్ర వ్యాప్తంగా జల, థర్మల్, సౌర విద్యుత్తు కేంద్రాల్లో పనిచేసే ఆర్టిజన్ స్థాయి నుంచి ఎస్ఈల వరకు శిక్షణ ఇస్తారు. ఇంజినీరింగ్ నిపుణులు, నూతన ఉద్యోగులతో పాటు ఎంవోయూ కుదుర్చుకున్న ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు (అప్రెంటిస్‌షిప్) నైపుణ్యాలు మెరుగుపరుస్తారు. శిక్షణ కేంద్రంలో పది మంది నిపుణులతో పాటు మరో 30 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు శిక్షణ వ్యవధి వారం నుంచి మూడు నెలల వరకు ఉంటుంది. ప్రస్తుతం ఏటా సుమారు 500 మంది తర్ఫీదు పొందుతున్నారు.

'సిమ్యులేటర్, హాస్టల్ భవనాలను ప్రారంభానికి సిద్ధం చేశాం. సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు కలల ప్రాజెక్టు ఇది. సీఎండీ చేతుల మీదుగా ప్రారంభించడానికి కార్యాచరణ రూపొందించాం."కందూరి శ్రీనివాస్ బాబు, సీఈ, శిక్షణ కేంద్రం

# రామాలయం ఉద్యోగులకు అంతర్గత బదిలీ

ఖమ్మం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఉద్యోగులకు అంతర్గత బదిలీ జరిగింది. ఈమేరకు ఈవో రమాదేవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన విభాగాల్లో కీలక మార్పులు చేపట్టారు. కొంతమందిని యథాతథంగా ఉంచినప్ప టికీ ఎక్కువ మందికి స్థానచలనం కలిగించడం ప్రత్యేకతను సంతరిం చుకుంది. కొందరి అండతో సుదీర్ఘకాలం నుంచి కదలకుండా ఉన్నవారికీ ఇప్పుడు సీట్లు మారడం విశేషం. రానున్న రోజుల్లో ఇంకొన్ని మార్పులు చేర్పులకు ఆస్కారం ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్ ఈవోగా పనిచేస్తున్న రమాదేవి రామాలయ పాలనను గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. వివాదాల జోలికి వెళ్లకుండా అందరినీ సమన్వయం చేయగలిగితే దేవాలయం ఆదాయం పెరిగే వీలుంది.



మార్పులు ఇవిగో..

దేవస్థానంలో ఇద్దరు ఏఈవోలు ఉన్నారు. ఇందులో రామాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈవో-1 వి.శ్రావణ్‌కుమార్‌ను కార్యాలయానికి పంపారు. కార్యాలయ బాధ్యతలను చూస్తున్న ఏఈవో-2 ఎస్.భవానీ రామకృష్ణారావుకు ఆలయ బాధ్యతలు అప్పగించారు. కొద్దిరోజులుగా ఈ అంశం నానుతున్నా అధికారిక ఉత్తర్వులతో స్పష్టత వచ్చింది. ముఖ్య విభాగాలన్నింటినీ వీరిద్దరు పర్యవేక్షిస్తారు.సూపరింటెండెంట్లకు స్థానచలనం కలిగింది. ఇప్పటివరకు భూముల వ్యవహారాలను చూస్తున్న నిరంజన్‌కుమార్‌కు సరకుల నిల్వ, ప్రసాదాల తయారీ, అన్నదానం, కల్యాణకట్ట, విచారణ విభాగం, టిక్కెట్-ప్రసాదాల కౌంటర్ల తనిఖీ బాధ్యతలు కేటాయించారు. రామాలయం సూపరింటెం డెంట్‌గా వ్యవహరిస్తున్న కె.శ్రీనివాసరావుకు భూములు-ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాలను అప్పగించారు. అన్నదానంతో పాటు కల్యాణకట్టను పర్యవేక్షిస్తున్న ఎల్.సాయిబాబాకు రామాలయం సూపరింటెండెంట్‌గా బాధ్యతలిచ్చారు. ఆయన ప్రొటోకాల్ పీఆర్వోగా వ్యవహరించనున్నారు. మరో సూపరింటెండెంట్ బి.కిశోర్ ఉత్సవాలు, ఆడిట్, ఆర్టీఐతో పాటు శని, ఆదివారాల్లో పర్ణశాల ఆలయాన్ని పర్యవేక్షిస్తారు. వివిధ కేటగిరిల్లోని సిబ్బందికీ బదిలీలు తప్పలేదు. శ్రీనివాసరెడ్డికి దుకాణాల లైసెన్స్, వీవీకేవీ సత్యనారాయణకు అన్‌లైన్ వ్యవహారాలు, స్వర్ణకుమారికి నగదు పుస్తకాలు, చెక్ పుస్తకాల నిర్వహణ, శ్రీకాంత్‌కు సరకుల నిల్వ విభాగం, జె.రాముకు పర్ణశాల, రామాలయ ఇన్‌స్పెక్ట ర్లుగా రాకేష్, చెమ్మరాజు, క్యాషియర్‌గా వాసు, పీఎస్వీ రమణ- అన్నదానం, కుమారి- మనీవాలిడ్, రామిరెడ్డికి సీఆర్వో, జ్యోతికి ప్రి ఆడిటింగ్ బాధ్యతలను కేటాయించారు. అటెండర్లు, వాచ్‌మెన్, ఇంజినీర్, శానిటేషన్, అకౌంట్స్, కంప్యూటర్ బాధ్యతలను ఆయా విభాగాలకు అప్పగించారు.

# గ్రామకంఠంలో ఇళ్లకు మడతపేచీ!



ఖమ్మం : తరతరాలుగా గ్రామకంఠం భూమిలో నిర్మించుకున్న ఇళ్ల క్రయవిక్రయాలు, వారసత్వ మార్పిడి తదితర రిజిస్ట్రేషన్లపై అధికారులు మడతపేచీ పెడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన రెవెన్యూ చట్టం-2018 ప్రకారం గ్రామకంఠం భూముల్లోని ఇళ్ల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లపై స్పష్టత కొరవడింది. వారసత్వంగా సంక్రమించిన ఇల్లు, పెరడు వంటి స్థలాలను అవసరాలకు విక్రయించుకునే పరిస్థితి లేదు. కొనుగోలుదారుకు రిజిస్ట్రేషన్ చేసేందుకు కొందరు సబ్ రిజిస్ట్రార్లు పలు రకాల ధ్రువపత్రాలు కావాలని.. లేదంటే రిజిస్ట్రేషన్ చేయబోమని చెబుతున్నారు. కొందరు పలుకుబడి, అర్థబలం కలిగిన వారికి మాత్రం గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తరతరాలుగా....గ్రామకంఠం భూమికి సర్వే నంబర్ ఉండదు. చాలా గ్రామాల్లో ఇలాంటి భూమిలో తరతరాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. పేదల నుంచి పెద్ద రైతులు, చిన్నపాటి ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు గ్రామాల్లో నివాసాలు కలిగి ఉన్నారు. ఆ ఇళ్లకు గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు కేటాయించారు. విద్యుత్తు మీటర్లు అమర్చారు. తాగునీటి పంపు కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్తు బిల్లులు, ఇంటి పన్ను చెల్లిస్తున్న రసీదులున్నాయి. గతంలో ఇలాంటి ఇళ్ల క్రయవిక్రయ లావాదేవీలు ఇంటి నంబరుపై జరిగేవి. రెండేళ్లుగా ఇంటి నంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు అభ్యంతరం తెలుపుతున్నారు.

ఎన్‌వోసీ పేరిట..

విక్రయించిన ఇల్లు నిర్మించిన భూమికి ఎన్‌వోసీ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) ధ్రువపత్రం తేవాలని సబ్ రిజిస్ట్రార్లు చెపుతున్నారు. ఇల్లు నిర్మించిన స్థలం ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి, ఇనాం భూమి కాదని గ్రామ పంచాయతీ నుంచి ధ్రువపత్రం తీసుకురావాలని సూచిస్తున్నారు. కానీ భూమి స్వభావాన్ని ధ్రువీకరించే అధికారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఉండదు. భూమి రికార్డులు గ్రామ పంచాయతీల్లో ఉండవు. అయినా గ్రామ పంచాయతీ నుంచి ఎన్‌వోసీ తేవాలని సబ్ రిజిస్ట్రార్‌లు తిప్పుకొంటున్నారు.

ఆన్‌లైన్ రికార్డుల్లో వివరాలు

గ్రామ పంచాయతీల్లో ఇళ్ల వివరాలు, ఇంటి నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్‌తో సహా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇంటి పన్ను వివరాలు.. చెల్లింపులు, బకాయిల వివరాలు సైతం ఆన్‌లైన్‌లో ప్రతి రోజూ అప్‌డేట్ అవుతున్నాయి. ఖమ్మం పరిసర సుడా పరిధిలోని గ్రామాల్లో ఇళ్ల వివరాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో లభ్యం అవుతున్నాయి. సుడా అమలులోకి వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణానికి సుడా నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. అయినా ఇలాంటి ఇళ్లను విక్రయించిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్లు ససేమిరా అంటున్నారు. ఖమ్మం రూరల్, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఇలాంటి కొర్రీలు విధిస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి...

చింతకాని, సత్తుపల్లి సహా పలు మండలాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యను ప్రజావాణిలో కలెక్టర్ గౌతమ్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఇటీవల చింతకాని మండలం నాగులవంచలో పర్యటించిన అదనపు కలెక్టర్ స్నేహలతకు తమ సమస్యను గ్రామీణులు మొరపెట్టుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎన్‌వోసీలు జారీ చేయరాదని గతంలో కలెక్టర్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. గ్రామకంఠం భూముల్లో తరతరాలుగా వస్తున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయవచ్చని గతంలో కలెక్టర్ గౌతమ్ ఫోన్‌లో ఖమ్మం రూరల్, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్లకు సూచించారు. అయినా పరిస్థితిలో మార్పులేదు. దీంతో ఇళ్లు, పెరటి స్థలాలు అమ్ముకోలేక, అప్పులు తీర్చలేక పలువురు ఇబ్బంది పడుతున్నారు.

ఆంక్షలు లేవు: చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం

గ్రామకంఠం భూముల్లో నిర్మించుకున్న ఇళ్లకు లేఅవుట్ అనుమతులు, ఎన్‌వోసీ లాంటి ధ్రువ పత్రాలు అవసరం లేదు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ 257 ప్రకారం గ్రామకంఠం భూమిలో నిర్మించిన ఇళ్ల క్రయవిక్రయాలపై, వారసత్వ బదలాయింపులపై ఆంక్షలు లేవు. రిజిస్ట్రేషన్లు చేయవచ్చని మార్గదర్శకాలున్నాయి. వీటిని జిల్లాలో అమలుచేసేలా చర్యలు తీసుకుంటాం.

# పంట కాల్వలున్నా... బోరు నీరే దిక్కు



ఖమ్మం : సాగర్ జలాలతో కాల్వలు, వాగులపై చెక్‌డ్యాంలు, ఎత్తిపోతలు, గ్రామగ్రామాన చెరువులు వంటి అనేక పథకాలతో ప్రభుత్వం పంటల సాగుకు నీటిని అందిస్తోంది. జిల్లాలో వేసవి మినహా నిరంతరం నీరు పారే అనేక ప్రాంతాలున్నాయి. అయినా వేలాది మంది రైతులు విద్యుత్తు మోటార్లపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఉచితంగా అందే నీటిని వదిలి రూ.వేలు ఖర్చు చేస్తూ, ప్రభుత్వంపై ఉచిత విద్యుత్తు భారం మోపుతూ రైతులు పంటల సాగుకు అవస్థ పడుతున్నారు. ఈ దుస్థితి ఎందుకు వచ్చింది, దీనికి కారణం ఎవరు? అనే అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరగాల్సి ఉంది.

ఆక్రమణలతో నీరు వృథా...

జిల్లాలో కృష్ణా నది జలాలతో కాల్వల ద్వారా సాగు నీరందిస్తున్నారు. అలాగే ఏర్లు, వాగులపై అనేక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలున్నాయి. చెరువులు, చెక్‌డ్యాంలున్నాయి. వీటి నుంచి దూరాన ఉన్న పొలాల వరకు పంట కాల్వలు ఏర్పాటు చేశారు. దీర్ఘకాలంలో వీటికి మరమ్మతులు మరచిపోయారు. అనేక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. పంట కాల్వలు ఆక్రమణకు గురయ్యాయి. ఆయా నీటి పథకాలను పర్యవేక్షించే అధికారులు, సిబ్బంది సరిపడినంత మంది లేకపోవడంతో ఆక్రమణలు తొలగించే పరిస్థితి లేకపోయింది. దీంతో అనేక ప్రాంతాల్లో రైతుల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి. గతంలో మాదిరిగా రైతుల మధ్య ఐక్యత లేకపోవడం, సాగునీటి సంఘాలు పని చేయకపోవడంతో ఆక్రమణలను తొలగించే వారు కరవయ్యారు. వెరసి సాగునీటి పథకాల పంట కాల్వల చివరి భూములకు నీరు చేరడంలేదు. అనేక ప్రాంతాల్లో పంటల సాగుకు ఉపయోగపడాల్సిన విలువైన జలాలు చెరువులు, వాగుల ద్వారా వృథాగా కిందకు వెళ్లిపోతోంది.

విద్యుత్తు ఖర్చు సాధారణంగా ఒక 5 హెచ్‌పీ మోటారు 10 గంటలు ఉపయోగిస్తే యూనిట్కు రూ.5 చొప్పున అనుకుంటే రూ.187.5 ఖర్చు అవుతుంది. ఎకరం మొక్కజొన్న, వరి, మిర్చి వంటి పైర్లకు ఒక తడికి కనీసం రూ.100 విద్యుత్తు ఖర్చు వస్తుంది. నీటి లభ్యత, మట్టిని బట్టి ఈ ఖర్చులో హెచ్చుతగ్గులు ఉండవచ్చు.

బావులు తవ్వించి..

పంట కాల్వల ఆక్రమణతో రైతులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నిరంతర విద్యుత్తు సరఫరాపై దృష్టి సారించారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి పంట పొలాల్లో బోర్లు, బావులు తవ్వించుకుని విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉచితంగా సాగు నీరందే ప్రాంతంలోనూ వ్యవసాయానికి విద్యుత్తును భారీగా వినియోగించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. వ్యవసాయ విద్యుత్తు డిమాండ్ ఏటా భారీగా పెరిగిపోతోంది.

మచ్చుకు కొన్ని ఆక్రమణలు

వైరా మేజర్ పరిధిలో దుద్దిపూడి సమీపంలోని ఓ పంట కాల్వ కింద సుమారు 50 ఎకరాలు సాగులో ఉంది. కాల్వ పూర్తిగా ఆక్రమణకు గురవడంతో చివరి భూములకు నీరందడం లేదు. దీంతో బోర్లు, బావులపై ఆధారపడి 15 విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకుని రైతులు పంటలు సాగు చేస్తున్నారు.నాగులవంచ మేజర్ పరిధి ముష్టికుంట్ల పోడు చేను ప్రాంతంలో నిరంతరం నీరు పారే పంట కాల్వ ఆక్రమణకు గురైంది. దీని కింది 60 ఎకరాలు సాగులో ఉంది. చివరి భూములకు నీరందక బోర్లు, బావులపై ఆధారపడుతున్నారు. ఈ ప్రాంతంలో 12 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లున్నాయి.పాపటపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో 150 ఎకరాలకు సాగునీరందించారు. కొన్నేళ్లుగా ఇది మూతపడింది. దీంతో సాగునీటి కోసం రైతులు వ్యక్తిగత బోర్లు, బావులు ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 25కిపైగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లున్నాయి.

# వివరాలన్నీ ఒకే యాప్‌లో

గోదావరిఖని :స్వయం సహాయ సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తుండగా.. సంఘాలను మరింత పటిష్ఠం చేసేందుకు సెర్ప్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఒకే యాప్‌లో మహిళా సభ్యురాలి వారీగా వివరాలు నమోదు చేసే ప్రక్రియ ప్రారంభించింది. ఇందుకు గానూ జిల్లాల వారీగా ఇప్పటికే శిక్షణ పూర్తి చేయగా మండలాల వారీగా శిక్షణ ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ఆధ్వర్యంలో 'లోకోస్' అనే కొత్త యాప్‌ను తీసుకువచ్చారు. ఇది వరకు ఒక్కో పథకం ఒక్కో యాప్‌లో నమోదు చేస్తుండే వారు. దీనివల్ల పథకం వారీగా వివరాలను నమోదు చేయడమే కాకుండా చూసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం అలా కాకుండా జిల్లా, మండల, గ్రామ, సంఘాలు, సభ్యుల వారీగా ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో ఒక్కొక్కరి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 1955 గ్రామైక్య సంఘాలు ఉండగా ఇందులో 49,387 స్వశక్తి సంఘాలలో 5,45,301 సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 565 గ్రామైక్య సంఘాలు ఉండగా 14,941 స్వశక్తి సంఘాల్లో 1,76,824 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఆయా సభ్యుల వారీగా యాప్‌లో నమోదు చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆర్థిక, సాంకేతికంగా మరింత బలోపేతం ఒకప్పుడు సూక్ష్మ రుణాలు తీసుకుని అధిక వడ్డీతో తిరిగి చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుని వీధినపడ్డ కుటుంబాలు మహిళా సంఘాలు ఏర్పాట చేసుకుని ఆర్థికంగా, సాంకేతికంగా ఎంతగానో బలోపేతమయ్యాయి. దీంతో బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా రుణాలు అందించేందుకు ముందుకు వచ్చాయి. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించడంతో గ్రామాల్లో రూ.కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయి. సంఘాలు, సభ్యులు జీవనోపాధిలోకి రాక ముందు, తరువాత వారి కుటుంబ ఆర్థిక స్థితి వివరాలు, సామాజికంగా అభివృద్ధి ప్రభుత్వ పథకాలపై అవగాహన, వ్యాపారం ఎలా చేస్తున్నారు? గ్రామంలోని సంఘాలలోని సభ్యుల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. సంఘ సభ్యురాలు సంఘంలో చేరకముందు చేసిన పని, ప్రస్తుతం చేస్తున్న పని వివరాలు తెలుసుకోనున్నారు.

# మండే ఎండల్లో ఆరోగ్యం జాగ్రత్త

ఖమ్మం : ఎండలు మండిపోతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉమ్మడి ఖమ్మం జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడదెబ్బ మరణాలు నమోదవుతున్నాయి. తప్పనిసరై బయటకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిసున్నారు. 15వ తేదీ రఘునాథపాలెం మండలం కామంచికల్లులో ఓ వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందారు. పలువురు వడదెబ్బ లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.వడదెబ్బ..: అధిక ఉష్ణోగ్రతలు శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతాయి. అందులో ముఖ్యమైనది వడదెబ్బ. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేని స్థితిలో ఇది సంభవిస్తుంది. ఎండ తాకిడికి గురైన సమయంలో వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుంది. ఎండ తీవ్రత కారణంగా చెమటలు పట్టే క్రమంలో కొన్నిసార్లు రక్తంలో ద్రవం ఎక్కువగా ఆవిరైపోతుంది. శరీర ఉష్ణోగ్రతలు 106 డిగ్రీల ఫారిన్ హీట్ దాటే ప్రమాదం ఉంది. చర్మం పొడిబారి నీరు, రక్త పరిమాణం, రక్తపోటు పడిపోతుంది. ప్రభావం ఎవరిపై..: పిల్లలు, వృద్ధులపై ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా ఉంటుంది. అధిక శారీరక శ్రమ చేసే వారు, ఎక్కువ సమయం ఎండలో పనులు చేసే వ్యక్తులు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న రోగులు, బీపీ ఔషధాలు, యాంటీ డిప్రెషన్, జలుబు, దగ్గు ఔషధాలు ఎక్కువగా వినియోగించే వారికి ప్రమాదం అధికంగా ఉంటుంది.లక్షణాలు ఇవీ..: వడదెబ్బ సోకినప్పుడు కండరాల తిమ్మిరి, చర్మం పాలిపోవడం, చెమటలు పట్టడం, విపరీతమైన బలహీనత, తలనొప్పి, వాంతులు, అధిక హృదయ స్పందన, మూత్రం ముదురు రంగుకు మారడం కన్పిస్తాయి.



ఏం చేయాలి: వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లగా ఉండే ప్రదేశానికి తరలించాలి. గందరగోళాన్ని తగ్గించడానికి అదనపు దుస్తులను తొలగించాలి. ప్రశాంత వాతావరణంలో ఉంచాలి. చల్లని షవర్, ఐస్‌ప్యాక్‌తో నుదురు, మెడ, శరీరాన్ని టవల్‌తో తుడవాలి.

నిప్పుల కుంపటిఖమ్మం జిల్లా మధిర అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లో సోమవారం అత్యధికంగా 44.4 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాయుడుపేటలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు జిల్లాల్లోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో సోమవారం సాయంత్రం 4.30 గంటల వరకు అత్యధిక స్టేషన్లలో 40 డిగ్రీలు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే మాసంలో ఇవి మరింతగా పెరిగే అవకాశం ఉంది. రాత్రి ఉష్ణోగ్రతలు 25 నుంచి 28 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

వేడి వాతావరణంలో తీవ్రమైన కార్యకలాపాల్లో పాల్గొనకూడదు. ఆరుబయట నీడలో విశ్రాంతి తీసుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలి. వేసవిలో వదులు, తేలికపాటి, లేత రంగు దుస్తులను ధరించాలి. చల్లని ద్రవాలు తాగాలి. నిర్జలీకరణకు గురి కాకుండా చూసుకోవాలి. మద్యం తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య పెరుగుతుంది. దోసకాయ, పుచ్చకాయ, దానిమ్మ, అరటిపండ్లు ఎక్కువగా తినాలి. బయటకు వెళ్లినపుడు శరీరాన్ని పూర్తిగా కప్పే వదులు దుస్తులు ధరించడంతో పాటు టోపీ, నల్ల కళ్లద్దాలు, సన్‌స్క్రీన్ లోషన్ ఉపయోగించాలి. డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, సర్వజన ఆస్పత్రి, ఏఓ

# చెత్త నిర్వహణపై కొరవడిన చిత్తశుద్ధి

గోదావరిఖని : రాష్ట్రవ్యాప్తంగా వివిధ పుర, నగరపాలికలు చెత్త నిర్వహణలో వినూత్నమైన విధానాలతో ముందు వరసలో నిలుస్తుండగా రామగుండం నగరపాలిక మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీలు నిర్వహిస్తుండగా నగరపాలిక మాత్రం క్షేత్రస్థాయిలో నిర్వహణను విస్మరిస్తోంది. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ మొదలుకొని అంతటా నిర్లక్ష్యమే. చెత్త నిర్వహణ కోసమంటూ రూ.కోట్లు వెచ్చించి అత్యాధునిక వాహనాలు, యంత్రాలను కొనుగోలు చేసిన బల్దియా వాటిని వినియోగంలోకి తీసుకురాకపో వడంతో నిధులు వృథా అయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా త్వరలోనే క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు త్వరలోనే రామగుండంలో క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్నప్పటికీ బల్దియాలో చలనం మాత్రం శూన్యం.

గతంలో ఆదర్శం... నేడు అధ్వానం

సుమారు రెండున్నర దశాబ్దాల క్రితమే నగరపాలిక చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించింది. ఈ సేంద్రియ ఎరువును 'భూ సంజీవని' పేరిట పరిసర గ్రామాల రైతులకు ఉచితంగా పంపిణీ చేసి దాని ఆవశ్యకతపై అవగాహన పెంపొందించారు. కాగా పాలకవర్గాలు, అధికారుల తీరుతో చెత్త నిర్వహణ అటకెక్కింది. సుమారు ఐదేళ్ల క్రితం అప్పటి కమిషనర్ కొంత మేరకు శ్రద్ధ కనబరిచారు. కాలనీల వారిగా వంటింటి వ్యర్థాలను సేకరించి వాటి నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి పెరటి తోటలకు వాడుకునేలా ప్రోత్సహించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా వెలువడే పూల వ్యర్థాలను సైతం ఎరువు తయారీకి వినియోగించారు. ప్రస్తుతం పాలకవర్గం నిర్లక్ష్యం వల్ల ఇంటింటా చెత్త సేకరణ పకడ్బందీగా సాగకపోవడంతో రహదారులపైనే పేరుకుపోతోంది. చెత్త సేకరణ కోసం డివిజన్‌కో ఆటో ట్రాలీని ఏర్పాటు చేసినప్పటికీ అవి సరిపోకపోగా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మరో 50 ఆటో ట్రాలీల కొనుగోలునకు పాలకవర్గం తీసుకున్న నిర్ణయం ఆచరణకు నోచుకోవడం లేదు.

తీరని డంపింగ్ యార్డు సమస్య

గత కొన్నేళ్లుగా సింగరేణి 11ఎ గని సమీపంలోని సింగరేణి ఖాళీ స్థలాన్ని నగరపాలిక డంపింగ్ యార్డుగా వినియోగించింది. ఈ ప్రాంతంలో ఉపరితల గని విస్తరించడంతో సమస్య మొదలైంది. రామగుండం సమీపంలో డంపింగ్ యార్డుతో పాటు చెత్త నిర్వహణ కోసమంటూ ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు అడ్డుకున్నారు. కొద్ది రోజులు లక్ష్మీపురం సమీపంలో చెత్త వేయడంతో గ్రామీణులు చెత్త తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. ఆ తర్వాత లింగాపూర్ రోడ్డులోని గుట్ట పక్కన చెత్త వేయాలనుకోగా అక్కడ స్థానికుల నుంచి వ్యతిరేకత తప్పలేదు. ప్రస్తుతం గోదావరినది ఒడ్డును డంపింగ్ యార్డుగా మార్చారు. నగరంలోని చెత్తనంతా అక్కడే వేస్తుండడంతో పాటు కాలుస్తున్నారు. పరిశ్రమల వ్యర్థాలతో గోదావరి నీరు కలుషితమవుతుండగా డంపింగ్ యార్డుతో మరింత ఇబ్బందికరంగా ఉంది. హిందూ శ్మశాన వాటికకు, నదిలో పుణ్యస్నానాలకు వచ్చే వారితో పాటు సమీపంలోని వ్యాపారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

# బియ్యమా.. పైసలా..!

నిర్మల్ : పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కల్పించిన ఆహార భద్రత పథకం లబ్ధిదారుల కంటే రేషన్ డీలర్లకు వరంగా మారింది. దుకాణాల ద్వారా ప్రజలకు ప్రతి నెల రేషన్ బియ్యం అందించాల్సిన డీలర్లు లబ్ధిదారులతో బేరసారాలు దిగుతున్నారు. కేవలం వేలిముద్ర వేస్తే చాలు కిలోకు గరిష్ఠంగా రూ.10 చొప్పున లబ్ధిదారులకు అప్పటికప్పుడు ఇస్తున్న డీలర్లు మిగిలిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి అక్కడ కిలో రూ. 25 నుంచి రూ. 30 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

జరుగుతున్న తంతు ఇలా...ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చౌకధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని అందజేస్తారు. లబ్ధిదారుల వేలిముద్ర గాని, ఐరిస్ స్కాన్ ద్వారా కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ఒక్కో వ్యక్తి పేరిట ఆరు కిలోల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. కాగా చాలా మంది అనర్హులు లబ్ధిదారులుగా ఉండటం,



మరో వైపు బీపీఎల్ కుటుంబాలు కూడా రేషన్ బియ్యం తినడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో వాటిని అమ్ముకొని సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరగా తీసుకున్న డీలర్లు తామే డబ్బులు ఇచ్చి బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,64,277 కార్డులు ఉండగా.. సుమారు 1,83,42,648 కిలోల బియ్యం లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా ప్రతినెల రూ. 10 కోట్లకుపైగా విలువైన సరకు అక్రమార్కుల పాలు అవుతున్నట్లు అంచనా. కొరవడిన తనిఖీలు

ఎప్పటికప్పుడు పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉన్నా..పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. అడపాదడపా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం పట్టుబడుతుంటున్న అధికారులు రేషన్ దుకాణాల వైపు దృష్టి సారించాల్సి ఉంది.

# నూతన సాంకేతికత.. నకిలీలకు అడ్డుకట్ట

మంచిర్యాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పలు రకాల మార్పులు చేసేందుకు సాంకేతికతను వివిధిగా వినియోగిస్తోంది. దీనివల్ల కూలీలు చేసే పనుల్లో పారదర్శకత పెరగడంతోపాటు నకిలీ కూలీలకు అడ్డుకట్టవేసే అవకాశం ఉంటుందనేది ప్రభుత్వ భావన. తాజాగా కూలీల హాజరును పక్కాగా ఆన్‌లైన్‌లో అమలు చేసేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) ను ప్రవేశపెట్టింది. గత మూడు రోజులుగా ఈ విధానం ద్వారానే కూలీల హాజరును తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో క్షేత్రస్థాయిలో కూలీలు అవస్థలు పడుతున్నారు.

యాప్ పనితీరిలా...ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పక్కా కూలీల హాజరును దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల వద్ద నమోదు చేసిన శ్రమశక్తి సంఘాల ఆధారంగా హాజరును చేపట్టున్నారు. ఉపాధి కూలీల హాజరును ప్రతి రోజు రెండు సార్లు పనిప్రదేశానికి వెళ్లి పనులు చేస్తున్న చిత్రాలను స్మార్ట్ ఫోన్ ద్వారా ఫొటోలు తీసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో పొందుపర్చాల్సిన బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ మేట్లకు అప్పగించారు. గతంలో ఆన్‌లైన్ ద్వారానే హాజరును తీసుకున్నప్పటికీ కేంద్రం తాజాగా నూతన యాప్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. 20 మంది కూలీల సంఖ్య కంటే అధికంగా కూలీలు పనులు చేసే ప్రాంతాల్లో కూలీల హాజరును ఈ




విధానం ద్వారానే పంపాలనే ఖచ్చితమైన ఆదేశాలు వచ్చాయి. ప్రతి రోజు కూలీలు పనులు ప్రారంభించిన వెంటనే ఉదయం 7 గం.లకు, అనంతరం పనులు ముగించే క్రమంలో మధ్యాహ్నం 12 గం.లకు పని ప్రదేశాల్లో నుంచి కూలీల హాజరును ఫొటోలు తీసి యాప్‌లో నమోదుచేసేలా రూపొందించారు. ఈ విధానంతో నకిలీ కూలీలు ఆట కట్టనుంది. గతంలో పలువురు కూలీలు పనుల్లోకి రానప్పటికీ హాజరువేసి వారికి డబ్బులు చెల్లించిన ఆరోపణలు వచ్చాయి. కొందరు అనుకూలురకు పనులు కల్పించి మరికొంతమందికి పనులు కల్పించకుండా అడ్డుకున్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో యాప్ ద్వారా హాజరును పక్కాగా అమలు చేస్తే అవకతవకలు పూర్తిగా తగ్గిపోనున్నాయి. యాప్‌తో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరుగుతుంది. జియో ట్యాగింగ్ విధానం ద్వారా పనులు చేసే ప్రాంతాలు, కూలీల సంఖ్య తెలుస్తుంది. పనుల్లో అక్రమాలు తగ్గడంతో పాటు సామాజిక తనిఖీలకు ఎంతో ఉపయోగపడనుంది.

పారదర్శకత పెరుగుతుంది.

ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పనులు, కూలీల హాజరులో పారదర్శకత పెరుగుతుంది. పనుల్లో నాణ్యత పెరుగుతుంది. కూలీలకు న్యాయం కలుగుతుంది. ప్రతి కూలీకి కనీస పనిదినాలు కల్పించే వీలుంటుంది. పనులపై బాధ్యత పెరిగి క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులు చేసే అవకాశం ఉంటుంది. తద్వారా అనేక మందికి ఉపాధి దొరుకుతుంది. - శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల

# ప్రస్తుతం నిర్వీర్యం.. కావాలి పూర్వ వైభవం




నిర్మల్ : ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఏకైక విశ్వవిద్యాలయ పీజీ కళాశాల నిర్మల్‌లో ఉంది. అన్నీ కలిసొస్తే విశ్వవిద్యాలయంగా మారేది. అనుకోని అడ్డంకులతో ఆ ప్రక్రియకు అవరోధం కలిగింది. క్రమంగా ప్రవేశాలు తగ్గి, కోర్సుల నిర్వహణ పూర్తిగా నిర్వీర్యమైంది. ఒకప్పుడు పలు కోర్సులు, ఎంతోమంది విద్యార్థులతో కళకళలాడిన ఆ భవనం ఇప్పుడు ఎందుకుకొరగాని దుస్థితికి చేరింది. ఈసారైనా ప్రవేశాలు వచ్చి పూర్వవైభవం దక్కుతుందేమోనన్న ఆశ స్థానికుల్లో మిణుకు మిణుకుమంటోంది. ఈ స్థితిలో ఆ భవనంలో జిల్లా కోర్టు ఏర్పాటుకున్న అవకాశాలను పరిశీలించడం అందరినీ అయోమయానికి గురిచేస్తోంది.

తలో చెయ్యేసి.. పాతాళానికి తోసేసి

గతంలో ఎంఏ సోషియాలజీ, ఆంగ్లం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులతో పాటు పలు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుండేవి. వసతిగృహ సౌకర్యమూ ఉండేది. బోధన, బోధనేతర సిబ్బందిలో కొంతమంది స్వప్రయోజనాల కోసం కళాశాల ప్రాభవాన్ని తగ్గించారనే విమర్శలున్నాయి. స్పాట్ అడ్మిషన్లను విస్మరించారు. ఏదైనా కోర్సుల్లో నలుగురైదుగురు ప్రవేశం పొందినా వారిని ఇతర చోట్లకు పంపించారు. కోర్సుల్లో ప్రవేశాలు లేకపోవడంతోనే వాటిని తరలిస్తున్నామనే భావన కల్పించారు. సోషియాలజీ విభాగంలో ప్రవేశాలు లేవన్న కారణంతో కోర్సును ఇక్కడి నుంచి తరలిస్తూ విశ్వవిద్యాలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ, విశ్వవిద్యాలయ పరిధి మార్పు జరిగిన సందర్భంలో కోర్సులు, బోధనా సిబ్బందిని తమ యూనివర్శిటీకి తరలించుకునే వెసులుబాటుంది. కేవలం ఒక విద్యా సంవత్సరంలో ప్రవేశాలు రాలేదన్న సాకుతో కోర్సును, మంజూరైన బోధన సిబ్బందిని సైతం తరలిస్తూ 'అంతర్గతంగా' తీర్మానించడం అధికారుల అత్యుత్సాహానికి అద్దంపడుతోంది. ఇతర కోర్సులైన ఆంగ్లం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లోనూ ప్రవేశాల్లేవు. ఇలాంటి స్థితిలో తాత్కాలికంగా కోర్సును సుషుప్తావస్థలో ఉంచే అవకాశం ఉంది. ఆ తర్వాతి విద్యాసంవత్సరంలో ప్రవేశాలు కల్పించి కోర్సును యథాతథంగా నిర్వహించొచ్చు. ఇవేవీ లేకుండా కేవలం కొందరి ప్రయోజనాల కోసం కళాశాల భవితవ్యాన్నే తాకట్టుపెట్టారని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఆస్తులపై శీతకన్ను..పీజీ కళాశాల సంరక్షణను, విలువైన స్థిర, చరాస్తులను విశ్వవిద్యాలయ అధికారులు నిర్లక్ష్యం చేశారనే వాదనలున్నాయి. పట్టించుకునే వారు లేక గతంలో కళాశాల గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చింపేసి, కుర్చీలు, తలుపులను ధ్వంసం చేశారు. ఖాళీగా ఉందన్న కారణంతో అక్కడ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నిర్వహించేందుకు ముందుకొచ్చినా తరగతులు జరగలేదు. తాజాగా.. భవనాన్ని పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు, అక్కడ జిల్లా న్యాయస్థానం నిర్వహణకు తగిన సౌకర్యాలు కల్పించాలంటూ స్థానిక తహసీల్దార్‌కు ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవేళ కోర్టు ఏర్పాటుచేస్తే, భవిష్యత్తులో ఇక కళాశాల కనుమరుగయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రవేశాలు కల్పిస్తేనే..

గతంలో పలుమార్లు ప్రవేశపరీక్షలు నిర్వహించినా, కౌన్సెలింగ్‌లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా, కళాశాల భవితవ్యం కోసం స్పాట్ అడ్మిషన్లు అవకాశం కల్పించేవారు. కానీ సుమారు అయిదేళ్లుగా ఈ పరిస్థితి కనిపించడం లేదు. గత పీజీ కౌన్సెలింగ్ సమయంలోనూ నిర్మల్ కళాశాల పేరును జాబితాలో పేర్కొనకపోవడం గమనార్హం. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయానికి కొత్త ఉపకులపతి నియమితులవడం, పీజీ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్రవ్యాప్త ఉమ్మడి ప్రవేశపరీక్షకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుండటంతో కళాశాలకు పునర్వైభవం వస్తుందనే ఆశలు రేకెత్తిస్తున్నాయి.

గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం: నంగె శ్రీనివాస్, విశ్వవిద్యాలయ సాధన సమితి అధ్యక్షుడు, నిర్మల్ ప్రస్తుత పీజీ కళాశాలను విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరించేందుకు గతంలో ప్రయత్నించాం. రాజకీయ ప్రమేయంతో అది నిలిచిపోయింది. కళాశాలలో పనిచేసిన పలువురు బోధన, బోధనేతర సిబ్బంది వైఖరి కారణంగా ప్రస్తుతం నిర్వీర్యంగా మారింది. కళాశాలను సంరక్షించాలంటూ ఇప్పటికే కాకతీయ ఉపకులపతికి విన్నవించాం. జిల్లా న్యాయస్థాన ఏర్పాటును అడ్డుకుంటాం. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం.

# ఆరేళ్లయినా అనుసంధానమేది?



నిర్మల్ : నిర్మల్-నిజామాబాద్ జిల్లాల మధ్య దూ(భా)రం తగ్గించేందుకు లోకేశ్వరం మండలంలో పంచగుడి సమీపంలో గోదావరి నదిపై వారధితోపాటు ఇరువైపులా 20 కి.మీ రహదారి నిర్మాణానికి 2014లో తెరాస సర్కారు అధికారంలోకి రాగానే అనుమతినిచ్చింది. 2015లో నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేయడం.. 2016లో టెండరు ప్రక్రియలు పూర్తి చేసుకుని పనులు ప్రారంభించడం చకచకా జరిగిపోవడంతో రెండు జిల్లాల ప్రజలు తమ కల త్వరలోనే నెరవేరుతుందని సంబరపడ్డారు. పనులు ప్రారంభించి ఆరేళ్లు పూర్తవుతుంది. గుత్తేదారుకిచ్చిన గడువు ముగిసి నాలుగేళ్లు దాటుతున్నా ఇంతవరకు రెండు జిల్లాల అనుసంధాన రహదారి మాత్రం పూర్తికాలేదు.

అడుగడుగునా ఆటంకాలే..2016లో గుత్తేదారు పనులు ప్రారంభించగానే గోదావరి నదిలో వరదల కారణంగా నీటి ఉద్ధృతి పెరగడంతో వారధి పనులు ఆగిపోయాయి. అలా ఆరు నెలలు నిలిచి పోయి నీటి ఉద్ధృతి తగ్గగానే జోరుగానే కొనసాగించారు. ఎలాగోలా 2019 జూన్‌లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. లోకేశ్వరం నుంచి పంచగుడి వరకు పరిహారం మంజూరు కాకపోయినా రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో దాదాపు 7 కి.మీ. వంద అడుగుల వెడల్పుతో భూసేకరణ చేపట్టి రహదారి పనులు పూర్తి చేశారు. పంచగుడి నుంచి వంతెన వరకు గల భూములకు పరిహారం వచ్చేదాక తాము రహదారి నిర్మాణం చేపట్టనీయమని రైతులు తేల్చి చెప్పడంతో 3 కి.మీ. మేర ఆగిపోయాయి. ఇదే పరిస్థితి నిజామాబాద్ జిల్లాలోనూ కొనసాగింది. ఎట్టకేలకు గతేడాది పరిహారం అందించిన అధికారులు సర్వే నెంబరులోని మొత్తం భూమికి రైతుబంధు ఆపేయడంతో వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. ఇటీవలనే ప్రభుత్వం రహదారి నిర్మాణంలో కోల్పోయిన భూములను తొలగించి మిగతా భూములను ధరణిలో చేర్చడంతో ఆటంకాలు తొలగిపోయాయి. కానీ రహదారి మధ్యలోని విద్యుత్తు స్తంభాలను తొలగించేందుకు అధికారులు రూ.38లక్షలు బిల్లులు చేసినా ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల కాకపోవడంతో డిస్కం అధికారులు పనులు నిలిపివేశారు. ఇలా ఏదో ఒక రీతిలో పనులకు ఆటంకం కలుగుతూనే ఉండడంతో విసిగుచెందిన గుత్తేదారు సైతం తనకు బిల్లులు సకాలంలో అందడం లేదని క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేసి కూలీలను, యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించి మరో గుత్తేదారు(సబ్ కాంట్రాక్టరు)కు పనులు అప్పగించినట్లు తెలుస్తోంది.

ఆది నుంచి అవాంతరాలే.. కొండయ్య, డీఈఈ, ఆర్అండ్‌బీ శాఖ ఇప్పటివరకు ఈ రహదారికి రైతులకు పరిహారం అందక పోవడం, తర్వాత కరోనా ప్రభావం, బిల్లులకు నిధులు లేకపోవడం, రైతుబంధు ఆగిపోవడం తదితర అవాంతరాలు ఎదురయ్యాయి. ఇప్పుడిప్పుడే అవన్నీ అధిగమించాం. పొలాల నూర్పిడి పూర్తి కావడంతో హద్దుల మేరకు ట్రెంచ్ కొట్టిస్తున్నాం. ఇదే రీతిలో పనులు సాగితే నందిపేట నుంచి వంతెన వరకు రెండు నెలలలోగా రహదారి నిర్మాణం పూర్తి చేయిస్తాం.

ప్రాజెక్టు: పంచగుడి వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణం, ఇరువైపులా 20 కి.మీ. రహదారి నిర్మాణం

అంచనా వ్యయం: రూ.108 కోట్లు

వంతెన పొడవు 600 మీటర్లు, వెడల్పు 50 అడుగులు

పనుల ప్రారంభం: 2016లో, పనులు పూర్తవ్వాల్సిన గడువు: 2018

భూసేకరణ ప్రక్రియ: నిజామాబాద్ జిల్లాలో 61.30 ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 51.39 ఎకరాలు

# రావొచ్చు.. నచ్చిన పూలు కోసుకోవచ్చు!

నిర్మల్ : నుంచి ఉట్నూరు వెళ్లే మార్గంలో శ్యాంపూర్ పంచాయతీ పరిధిలోని గోదరిగూడకు చేరుకోగానే పూల సువాసనలు రారమ్మని ఆహ్వానిస్తుంటాయి. రహదారుల పక్కనే వరుసగా పూలు విక్రయిస్తుంటారు. ఆ పక్కనే పూలతోటలు కనిపిస్తూ ఉంటాయి. అయిదేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాలలోని ప్రజలు తమ ఇంట్లోని శుభకార్యాలకు పూలు కావాలంటే ఇటు ఆదిలాబాద్ అటు మంచిర్యాలకు వెళ్లి తెచ్చుకునేవారు. దీంతో రవాణా ఖర్చుతో పాటు ఒక రోజు సమయం పట్టేది. తీరా ఆ పూలను ఇక్కడ వరకు తెచ్చుకునే సరికి అవి వాడిపోయేవి. ఇంట్లో శుభకార్యం జరగాలంటే పూలు దొరకడమే పెద్ద కష్టంగా మారింది. అప్పుడు కొందరు రైతులకు ఆ పూలను మనమే పండిస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. వెంటనే మంచిర్యాల, నిజామాబాద్



జిల్లాలో పూల సాగు చేస్తున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ వెళ్లి విత్తనాలు కొనుక్కున్నారు. వారికున్న ఇంటి ముందు, పక్కనే ఉన్న గుంట, అరగుంట స్థలం భూముల్లో మల్లె, చామంతి, గులాబీ సాగుకు శ్రీకారం చుట్టారు. దీంతో శుభకార్యాలు జరుపుకొనే వాళ్లు ఇక్కడకే వచ్చి పూలు కోసుకుంటున్నారు. కొందరు పెళ్లిళ్లకు కావాల్సిన పూల కోసం ముందస్తుగా డబ్బులు ఇస్తున్నారు. ఇక్కడ మరో ప్రత్యేకత ఉందండి. పూల తోటలోకి వెళ్లి మనకు నచ్చిన పూలు కోసుకునే సదుపాయం ఉంది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడతో పాటుగా కుమురం భీం జిల్లా కెరమెరి, జైనూర్, సిర్పూర్ నుంచి వచ్చి పూలు కొనుగోలు చేస్తున్నారు. ఏడాదంతా పూల సాగుతో మంచి లాభాలు పొందుతున్నామని రైతులు చెబుతున్నారు.

# మారని వైద్యారోగ్యశాఖతీరు..!

మంచిర్యాల : జిల్లా వైద్యారోగ్యశాఖ వ్యవహారశైలిలో మార్పు రావడంలేదు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాల్సిందిపోయి.. సొంత ప్రయోజనాల కోసం ఇష్టారీతిన నియామకాలు చేపడుతున్నారు. ఈవినింగ్ క్లినిక్స్ పేరుతో ప్రత్యేక విభాగాలకు చెందిన వైద్యులతో ప్రజలకు వైద్యసేవలందించాలని ఇటీవల జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్(ఎన్‌యూహెచ్‌ఎం)ప్రవేశపెట్టిన కార్యక్రమంలోనూ అవకతవకలు జరుగుతున్నాయి. ఈ క్లినిక్‌లో పనిచేసే వైద్యుడి నియామకమే గందరగోళంగా చేపట్టారు. నియామకం చేసిన వ్యక్తి వివరాలను పరిశీలించకుండా, ఎలాంటి సమాచారం సేకరించకుండా ఇప్పటికే ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్న వైద్యుడికి మరొక కొలువును ఇవ్వడంపై విమర్శలు వ్యక్తవుతున్నాయి. ఈ కొలువును నిర్వహించేందుకు ఖాళీగా ఉన్న వైద్యులు అనేకమంది ఉన్నా ప్రత్యేకంగా జిల్లా ఆసుపత్రిలోని ఐసీయూలో అత్యవసర సేవలకింద పనిచేస్తున్న వ్యక్తికి ఇవ్వడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

రెండుచోట్ల విధులు ఎలా సాధ్యం..ఈవినింగ్ క్లినిక్‌లో భాగంగా స్థానిక రాజీవనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు పనిచేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ జనరల్ ఫిజీషియన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నియామకమైన వైద్యుడు ఇప్పటికే అత్యవసర సేవలకింద పెద్దాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. ఐసీయూ పూర్తి బాధ్యతలు కూడా ఇతనివే. బాధితుల వైద్యసేవల దృష్ట్యా ఆ వ్యక్తి ఏ సమయంలో ఆసుపత్రి నుంచి పిలుపు వచ్చినా వెంటనే వచ్చి వైద్యమందించాలి. ఇలా 24 గంటలు నిత్యం అప్రమత్తంగా ఉంటూ సేవలందించే పోస్టులో ప్రస్తుతం అతను కొనసాగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఆ వైద్యుడిని మరోచోట నియమించడం ఏంటో అర్థం కావడంలేదు. అక్కడ పనిచేస్తుండగా ఇక్కడ ఏదైనా విషమ పరిస్థితి వస్తే ఎవరు బాధ్యత వహిస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ చిన్న విషయాన్ని జిల్లా వైద్యాధికారి గమనించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. దీంతో ఈ నియామకం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై వైద్యాధికారిని వివరణ కోరగా అతనొక్కడే పనిచేసేందుకు ముందుకొచ్చారని, అందుకే నియామకం చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రకటన ఇవ్వకుండానే నియమించేందుకు అధికారం ఉందని చెప్పారు. కాగా ఈ ప్రకటన ఇవ్వకుండా ఏ ఒక్కరికి తెలియకుండానే అతను మాత్రమే ముందుకొచ్చారనడం విచిత్రంగా అనిపిస్తోంది.

రిలీవ్ చేయాలంటూ ఆదేశాలు..జిల్లా ఆసుపత్రిలోని ఐసీయూలో పనిచేస్తున్న వైద్యుడిని రిలీవ్ చేసి, ఈవినింగ్ క్లినిక్‌లో పనిచేసేందుకు అనుమతి కోరుతూ ఇక్కడి పర్యవేక్షణాధికారికి జిల్లా వైద్యారోగ్యశాఖకార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కానీ ఆ ఉత్తర్వులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది.

# కాసులిస్తే సరే..!

నిర్మల్ : కాసులు ఇస్తే చాలు.. రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా ఇసుక తరలించడానికి అనుమతులు వస్తాయి. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ మామూళ్లకు అలవాటు పడి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసిపేట మండలంలోని కాసిపేట, గొండుగూడెం, పెద్దనపల్లి శివారులోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వేసవి కాలంలో జోరు ఇసుకను తరలిచేందుకు వాగు ప్రాంతాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో ఇబ్బంది ఉంటుంది. చేనులో పంటలు ఉంటే కొందరు యజమానులు అనుమతులు ఇవ్వరు. దీంతో వేసవికాలం వచ్చిందంటే పంటల పొలాల వారికీ ఎంతోకొంత ముట్టజెప్పి ఏకంగా రహదారులనే ఏర్పాటు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మైనింగ్ శాఖలో అధికారులు తక్కువ శాతం ఉన్నారు.దీంతో అక్రమంగా వాగుల నుంచి ఇసుక తరలిపోకుండా ఉండేందుకు ఒప్పంద ప్రాతిపదికన కొందరిని నియమించారు. దీంతో వారు అడ్డూ అదుపు లేకుండా ట్రాక్టర్ల యజమానుల నుంచి నెల వారీగా వసూలు చేస్తూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్లంపల్లి డివిజన్ పరిధిలో సుమారు 300 ట్రాక్టర్ల యాజమానుల వద్ద నుంచి కాసులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు ట్రాక్టర్ల యజమానులతో ఇటీవల ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న సిబ్బంది ఫోన్ కాల్ ద్వారా నగదు ఇవ్వాలని మాట్లాడిన సంభాషణ చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చేందుకు బెల్లంపల్లి డివిజన్‌లోని నెన్నెల మండలంలో ఇసుక క్వారీ అనుమతులు ఇచ్చారు. ఇక్కడి నుంచి కాసిపేట, దేవాపూర్, మందమర్రి, తాండూరు మండలాలకు ఆన్‌లైన్ ద్వారా ఇసుక కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ దూరం కావడంతో ఇసుక ట్రాక్టర్‌కు రూ. 4 వేల వరకు చెల్లించాలి.




దిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు వ్యవహారంలో ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 25 వరకు అవినాష్‌ను అరెస్ట్ చేయొద్దంటూ సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా సుప్రీంలో సునీత దాఖలు చేసిన పిటిషన్ అంశాన్ని జస్టిస్ ఎంఆర్ షా ధర్మాసనం ఎదుట ఆమె తరఫు న్యాయవాదులు ప్రస్తావించారు. దీనిపై శుక్రవారం విచారణ చేపడతామని ధర్మా సనం పేర్కొంది. అవినాష్ ఈనెల 25 వరకు ప్రతి రోజూ సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని తెలంగాణ హైకోర్టు షరతు విధించింది. ప్రశ్నలను రాతపూర్వకంగా ఇవ్వాలని.. విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని సీబీఐకి ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 25న తుది ఉత్తర్వులు జారీ చేస్తామంటూ విచారణను వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సునీత సుప్రీంను ఆశ్రయించారు.




ఆలూరు: మంత్రి గుమ్మనూరు జయరామ్ 180 ఎకరాల ఇట్టినా కంపెనీ భూములను కాజేశారంటూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పలు ఆధారాలను విడుదల చేశారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆయన బయటపెట్టారు. కమర్షియల్ ల్యాండ్‌గా ఉన్న భూమిని వ్యవసాయ భూములుగా చూపిన మంత్రి.. తన కుటుంబం పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రూ.45 కోట్ల విలువైన భూమిని రూ.2కోట్ల ప్రభుత్వ విలువ చూపించి కారుచౌకగా కొట్టేసిన ఘనుడు బెంజ్ మంత్రి అంటూ లోకేశ్ దుయ్యబట్టారు. వ్యవసాయంలో లాభం వచ్చిందన్న మంత్రి.. ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం ఎందుకు తీసుకున్నారని ఆయన నిలదీశారు. రైతులు ముందుకొస్తే ఇట్టినా భూములను రాసిస్తానన్న మంత్రి.. రిజిస్ట్రేషన్ తేదీ ప్రకటించాలని లోకేశ్ సవాల్ విసిరారు. ఆ భూములను తామే కొని రైతులకు పంచుతామని చెప్పారు. "ల్యాండ్ సీలింగ్ యాక్ట్ నిబంధనలను మంత్రి, ఆయన కుటుంబసభ్యులు అతిక్రమించి భూములు కొనుగోలు చేశారు. ఐటీ బినామీ యాక్ట్ ప్రకారం బెంజ్ మంత్రి దొరికిపోయారు. కుటుంబ భూముల ద్వారా వచ్చిన ఆదాయంతో ఇటినా భూములను కొన్నానని చెబుతున్న మంత్రి.. ఎన్నికల అఫిడవిట్‌లో ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదు? ప్రభుత్వ ధర ప్రకారం ఎవరైనా ముందుకు వస్తే ఆ భూములను రైతులకు వెనక్కి ఇచ్చేస్తామని చెప్పిన మంత్రి.. ఇప్పుడు ఎందుకు మాటమార్చారు? మంత్రికి భూములు అమ్మిన మంజునాథ్.. సేల్ డీడ్ ఎందుకు రద్దు చేసుకున్నారు? ఐటీ శాఖకు అడ్డంగా దొరికిపోయి నీతులు మాట్లాడటం బెంజ్ మంత్రికే చెల్లింది. మీరు వందల ఎకరాలకు అధిపతి అయ్యారు.. ఇక్కడ ఉన్న ఒక్క వాల్మీకి కుటుంబమైనా ఎకరం భూమి కొనే పరిస్థితిలో ఉందా? మీకు దమ్ముంటే తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి" అని మంత్రి జయరామ్‌కు లోకేశ్ సవాల్ చేశారు. మరోవైపు లోకేశ్ ప్రశ్నలకు మంత్రి జయరామ్ సమాధానం చెప్పాలని ఆలూరు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ డిమాండ్ చేశారు.




## చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రఘురామ

ఢిల్లీ: 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసి, ఎన్నో సంస్కరణలకు మార్గదర్శి అయిన చంద్రబాబు నాయుడుకు ఎంపీ రఘురామ కృష్ణంరాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉండాలనేది చంద్రబాబు ఆకాంక్ష.. కోరిక అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 'హ్యాట్సాఫ్ సునీత రెడ్డి.. కంటే కూతురినే కనాలి' అని అన్నారు. గురువారం ఉదయం సీనియర్ న్యాయవాది సిదర్థా లుత్రా సుప్రీంకోర్టులో కేసు మెన్షన్ చేశారు. హైకోర్టు ఆర్డర్‌ను సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శుక్రవారం ఈ కేసును న్యాయస్థానం విచారించనుంది. నీచమైన కట్టుకథలు సాక్షిలో రాస్తున్నారని రఘురామ మండిపడ్డారు. హైకోర్టు తీర్పుపై ప్రజలు ఇదేమి తీర్పు అని అనుకున్నారని.. కానీ న్యాయస్థానాన్ని నమ్మాలని తాను విజ్ఞప్తి చేశానన్నారు. సునీత రెడ్డి సుప్రీంకోర్టుకు వస్తారని అవినాష్ రెడ్డి అనుకోలేదన్నారు. సీబీఐ, చంద్రబాబు కుమ్మక్కయ్యారని సజ్జల, వైసీపీ నేతలు అంటున్నారని, చంద్రబాబు అల చేస్తే జగన్ బయట తిరిగే వారా? ఒక్క రోజు కూడా కోర్టుకు వెళ్లకుండా ఉండే వారా? అని అన్నారు. సునీత రెడ్డి మౌనంగా న్యాయపోరాటం చేస్తుందని రఘురామ కృష్ణంరాజు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డిని ఈనెల 25వ తేదీ వరకు అరెస్టు చేయవద్దని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించిన విషయం తెలిసిందే. అప్పటిదాకా ఆయన ప్రతి రోజూ సీబీఐ విచారణకు హాజరు కావాలంటూ స్పష్టం చేసింది. కాగా.. అవినాశ్ రెడ్డి మధ్యంతర బెయిల్‌కు వ్యతిరేకంగా వివేకా కుమార్తె వైఎస్ సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌ను సుప్రీం విచారణకు స్వీకరించింది. ఈ రోజు సీజేఐ ధర్మాసనం ముందు సునీత పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ప్రస్తావించారు.

## వైఎస్ వివేకా కేసులో అసలు ముద్దాయి ఎవరో చెప్పిన టీడీపీ నేత



గుంటూరు: ఏపీలోనే కాకుండా తెలుగు వారు ఎక్కడ ఉన్నా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్నారని మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... వచ్చే ఏడాది ఈ సమయానికి దుర్మార్గ పాలన అంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ కార్యకర్తలు ఈ ఏడాదంతా సైనికుల మాదిరిగా కష్టపడాలని పిలుపునిచ్చారు. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు దేనికైనా సిద్ధంగా ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదని పరీక్షల్లో అడిగితే రాయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి.. ప్రజల లెంపకాయలు వాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని చంపించింది జగన్ అని పులివెందుల, కడప జిల్లా ప్రజలకు ఏనాడో తెలుసన్నారు.

హత్య కేసు విచారణ సరిగా జరగటం లేదని సునీత సీబీఐ విచారణ కోరారని తెలిపారు. భాస్కర్ రెడ్డి, అవినాష్‌రెడ్డి కాదు అసలు ముద్దాయి జగన్ రెడ్డి అని... అందుకే కేంద్రం చుట్టూ చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. వివేకా కేసు విచారణ నుంచి ప్రజల దృష్టిని మరల్చటం కోసమే విశాఖలో కాపురం అంటున్నారన్నారు. ఇప్పుడు ఎక్కడైనా కాపురం పెట్టుకో.. ఎన్నికల తర్వాత తమరు కాపురం ఎక్కడ ఉండాలో ప్రజలు తేలుస్తారని వ్యాఖ్యలు చేశారు. కోడికత్తి వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ అడిగారని... ఇప్పుడు ఎన్ఐఏ విచారణకు పిలిస్తే వెళ్ళటం లేదన్నారు. కోడికత్తి వ్యవహారంలో జగన్ కుట్ర బయటకు రావాలన్నారు. కోడికత్తి శ్రీను నాలుగేళ్లుగా జైల్లో మగ్గుతున్నాడని.. దళిత యువకుడిని జైల్లో ఉంచి ఇబ్బంది పెడుతున్నారని నక్కా ఆనంద బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.




హైదరాబాద్: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కరరెడ్డి, వివేకా పీఏ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చొద్దని భాస్కరరెడ్డి, కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని దస్తగిరికి నోటీసు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను జూన్ మూడో వారానికి వాయిదా వేసింది.

**దస్తగిరి వాంగ్మూలం ఇదే..** "వివేకా హత్యలో సునీల్, ఎర్రగంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, నేను పాల్గొన్నాం. ఆర్థిక లావాదేవీలతోనే హత్య జరిగింది. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓడిపోయారు. ఎర్రగంగిరెడ్డి మోసం వల్లే ఓడిపోయానని వివేకాకు ఆగ్రహం. బెంగళూరు స్థలంపై పంచాయితీకి పలుమార్లు వివేకా వెళ్లేవారు. స్థలంలో ఎర్రగంగిరెడ్డి వాటా అడిగితే వివేకా ఆగ్రహించారు. 2018లో నేను వివేకా వద్ద పని మానేశాను. ఎర్రగంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్‌ను కలిసేవాడిని. 2019 ఫిబ్రవరి 2న సునీల్ యాదవ్‌ను, ఉమాశంకర్‌రెడ్డిని, నన్ను, ఎర్రగంగిరెడ్డి తన ఇంటికి తీసుకెళ్లారు. వివేకాను చంపాలని ఎర్రగంగిరెడ్డి నాకు సూచించారు. వివేకాను హత్య చేయలేనని చెప్పా. హత్య చేసేందుకు తామూ వస్తామన్నారు. వివేకా హత్య వెనక పెద్దల ప్రమేయం ఉందన్నారు. అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శంకర్ రెడ్డి ఉన్నారన్నాడు. శంకర్‌రెడ్డి రూ.40 కోట్లు ఇస్తాడని, అందులో రూ.5కోట్లు నాకు ఇస్తానని ఎర్రగంగిరెడ్డి చెప్పాడు. ఇలా జరిగిన 4 రోజులకు సునీల్ యాదవ్ నాకు రూ.కోటి ఇచ్చాడు. రూ.25 లక్షలు తనకివ్వాలని.. తర్వాత ఇస్తానని సునీల్ చెప్పాడు. రూ.75 లక్షలు మున్నా అనే వ్యక్తి వద్ద దాచి ఉంచా. సునీల్, ఉమాశంకర్.. వివేకా ఇంటికుక్కను కారుతో ఢీకొట్టి చంపారు. నేను కదిరి వెళ్లి గొడ్డలి కొని సునీల్ యాదవ్‌కు ఇచ్చా. మార్చి 14న ఎర్రగంగిరెడ్డి, సునీల్, ఉమాశంకర్, నేను వివేకా ఇంటికి వెళ్లాం. ముందుగా ఎర్రగంగిరెడ్డి వివేకా ఇంట్లోకి వెళ్లాడు. తర్వాత మేం ముగ్గురం గోడదూకి లోపలికి వెళ్లాం. బెంగళూరు స్థలంలో వివేకాను ఎర్రగంగిరెడ్డి వాటా అడిగారు. వాగ్వాదం జరిగి సునీల్ బూతులు తిడుతూ వివేకా ముఖంపై కొట్టాడు. కిందపడిన వివేకాపై ఉమాశంకర్‌రెడ్డి గొడ్డలితో దాడి చేశాడు. గొడ్డలితో దాడి చేసి ఆయన చేత్తో లేఖ రాయించాం. సునీల్, ఉమాశంకర్.. వివేకా ఇంట్లో కొన్ని పత్రాలు తీసుకున్నారు. ఆ తర్వాత స్నానాల గదిలోకి తీసుకెళ్లి వివేకాను గొడ్డలితో నరికి చంపారు. వివేకాను హత్యచేశాక అందరం గోడదూకి పారిపోయాం" అని సెక్షన్ 164 స్టేట్‌మెంట్‌లో దస్తగిరి వివరాలు వెల్లడించాడు. ఆగస్టు 30న ప్రొద్దుటూరు కోర్టులో దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు.

## అంబటి రాయుడు స్పీక్స్ : నమ్మకం అంటేనే జగన్



అమరావతి : మా నమ్మకం మా భవిష్యత్తు నీవే జగన్ ఇది ఇపుడు ఏపీలో సాగుతున్న ప్రోగ్రాం. టైటిల్ క్యాచీగా ఉంది అనుకున్నారో కానీ క్రికెటర్ అంబటి ఆయుడు నేను సైతం అంటూ జగన్ అంటేనే నమ్మకం. అసలు నమ్మకం అంటేనే జగన్ అంటూ గట్టిగా చెప్పేస్తున్నారు. ఈ అంతర్జాతీయ క్రికెటర్ గ్రౌండ్ లో దుమ్ము లేపుతారు. ఇపుడు పొలిటికల్ గ్రౌండ్ లో ఆయన కొత్త ఆట మొదలెట్టారు. జగన్ ట్విట్టర్ ని ఫాలో అవుతున్నారు. జగన్ ప్రతీ మాటను ఆయన ఫాలో అవుతున్నారు. లేటెస్ట్ గా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో జగన్ స్పీచ్ ఇచ్చారు అక్కడ మూలపేట పోర్టు కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్ ఇచ్చిన స్పీచ్ ని అంతా చూశారు. అయితే కరెక్ట్ గా రెస్పాండ్ అయింది మాత్రం అంబటి రాయుడే. ఆయన జగన్ సార్ మీ మీద ప్రతీ ఒక్కరికీ నమ్మకం ఉంది సార్ అంటూ తాను చెప్పాల్సింది చెప్పేశారు. అంతే కాదు జగన్ ఇచ్చిన స్పీచ్ ని గ్రేట్ స్పీచ్ అని కూడా కితాబు ఇచ్చారు. జగన్ శ్రీకాకులం స్పీచ్ ని వైసీపీ ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. దాన్ని రీ ట్వీట్ చేస్తూ అంబటి ఈ రకంగా మాట్లాడడం రాజకీయంగా చర్చకు తావిస్తోంది. 2024 ఎన్నికల్లో అంబటి ఏపీ నుంచి ఏదో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని అంటున్నారు. దానికి తగినట్లుగా గత కొద్ది రోజులుగా అంబటి వైసీపీ మీద ఒక లుక్కేశారు అని అంటున్నారు.

ప్రతీ ఒక్క కార్యక్రమాన్ని ఆయన అసలు విడవకుండా ఫాలో అవుతున్నారు. ఈ బిజీ క్రికెటర్ కి ఇంత తీరిక ఎలా అనుకుంటే పొరపాటు పడినట్లే. మనసు ఉంటే మార్గం ఉంటుంది కదా. ఆయనకు మనసు ఉంది. మార్గం కూడా వెతుక్కుంటున్నారు. బలమైన సామాజికవర్గానికి చెందిన అంబటి రాయుడు చాలా తొందరలోనే వైసీపీ తీర్థం పుచ్చుకుంటరని టాక్ నడుస్తోంది. ఆయన ఎక్కడ నుంచి పోటీ చేసినా గెలుస్తారు అనే అంటున్నారు. దానికి కారణం ఆయనకు ఉన్న హ్యూజ్ ఫ్యాన్స్ కాస్ట్ బేస్. ప్లస్ వైసీపీ వంటి బలమైన పార్టీ అని అంటున్నారు. మొత్తానికి వైసీపీ పాత నీరుని వదిలించుకుందామని చూస్తున్న వేళ ఒక కీలక రంగం నుంచి యువ క్రీడాకారుడు నేను రెడీ అనడం అంటే ఏపీలో వైసీపీ గ్రాఫ్ బాగానే ఉంది కదా ఏ సర్వే అవసరం లేదు కదా అని ఆ పార్టీ వారే అంటున్నారుట.


## ఏపీలో కరోనా మరణాలు లేవు.. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

విజయవాడ: దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 12591 కేసులు నమోదయ్యాయి. పాజిటివిటీ రేటు 5.32 శాతంగా నమోదైంది. ఈక్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అయితే, ఏపీలో మూడు కోవిడ్ మరణాలు సంభవించాయని వస్తున్న వార్తలపై వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాకినాడ, విశాఖపట్నంలో నమోదైన మూడు మరణాలకి కరోనా కారణం కాదని స్పష్టం చేశారు. మరణించిన వారిలో ఇద్దరు వైరల్ న్యూమోనియా, ఒకరు ప్యాంక్రియాలైటిస్ కారణంగా మరణించినట్లు వైద్యులు ధృవీకరించినట్లు తెలిపారు. ఏపీలో కరోనా మరణాలు లేవని, కరోనా పరీక్షల సంఖ్యని 5 వేలకి పెంచామని ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీవర్ సర్వేలో గుర్తించిన 17 వేల మంది జ్వర బాధితులకి పరీక్షలు నిర్వహించి, కరోనాపై అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఏపీలో గత వారంలో పాజిటివిటీ రేటు కేవలం 2.12 శాతం మాత్రమే



ఉందని, కరోనా పూర్తిగా అదుపులో ఉందని తెలిపారు. కరోనా ప్రస్తుత వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతుందని, రెండు రోజుల పాటు నిర్వహించిన కోవిడ్ మాక్ డ్రిల్ లో గుర్తించిన విషయాలని సమీక్షించినట్లు ఆయన వెల్లడించారు. కొత్త వేరియంట్‌పై ప్రజలు అనవసర భయాందోళనలకి గురి కావద్దని తెలిపారు. దీర్ఘకాలిక రోగాలున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## కస్టడీ విచారణ ఆడియో, వీడియో రికార్డ్ చేయాల్సిందే.. తెలంగాణ హైకోర్టు ఆదేశం




హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులు వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి కస్టడీ విచారణ ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాల్సిందే అని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కస్టడీలో సీబీఐ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ పాటించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి వేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. కస్టడీ విచారణలో సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాలు పాటించాలని స్పష్టం చేసింది. అలాగే న్యాయవాదిని రెండు గంటల వరకు అనుమతించాలన్న సీబీఐ కోర్టు ఉత్తర్వులు ధర్మాసనం సవరించింది. సాయంత్రం 5గంటల వరకు అంటే విచారణ పూర్తయ్యే వరకు న్యాయవాదిని అనుమతించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి కనిపించేలా న్యాయవాదిని అనుమతించాలని తెలిపింది. అయితే ప్రశ్నలు లిఖిత పూర్వకంగా అడిగేలా సీబీఐని ఆదేశించాలని భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి కోర్టును కోరగా.. దర్యాప్తు ఎలా చేయాలో సీబీఐకి చెప్పలేమన్న హైకోర్టు పేర్కొంది.

## చంద్రబాబు జన్మదిన వేడుకలు.. 73 కిలోల కేక్ కట్ చేసిన తెదేపా నేతలు

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు 73వ జన్మదిన వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. అన్ని జిల్లాల్లో తెదేపా నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబుకు బర్త్‌డే విషెష్ చెప్పారు. మంగళగిరిలోని తెదేపా జాతీయ కార్యాలయంలో ముఖ్యనేతలు చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, టీడీ జనార్దన్, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మన్నవ మోహనకృష్ణ, జలీల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 73 కిలోల కేక్‌ను అచ్చెన్నాయుడు, నేతలు కట్ చేశారు. చంద్రబాబుతోనే అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని.. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నేతలు ఆకాంక్షించారు.






## పొట్టి డ్రెస్సులో బుట్టబొమ్మ పరువాలు.. స్టన్నింగ్

గోపికమ్మా చాలును లేమ్మా ఈ నిదురా.. అంటూ గోపిక వేశంతో అందర్నీ ఆశ్చర్య పరిచి బుట్టబొమ్మా.. బుట్టబొమ్మ డ్యాన్స్ తో టాలీవుడ్ ను ఓ ఊపు ఊపిన పూజా హెగ్డే గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాస్క్ అనే తమిళ సినిమాతో 2012లో సినీ రంగంలో అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ... ఒక లైలా కోసం చిత్రం ద్వారా టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ముకుంద డీజే రంగస్థలం అరవింద సమేత మహర్షి అల వైకుంఠపురంలో వంటి బ్లాక్ బస్టర్ హిట్టు చిత్రాల్లో నటించి తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంది. అతి తక్కువ కాలంలోనే తన అందం అభినయంతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఓ వైపు సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు సోషల్ మీడియాల ద్వారా తన అభిమానులకు టచ్ లో ఉంటుంది. తాజాగా ఈ పొడుగు కాళ్ల సుందరి



ఇన్ స్టా వేధికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ పొట్టి డ్రెస్సులో అదిరిపోయింది. అందాలన్నీ ఆబోస్తూనే కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. ఎద అందాలు క్లీవేజ్ తో పాటు నడుము ఒంపుసొంపులు థైస్ అందాలను చాలా క్లియర్ గా చూపిస్తోంది. హెయిర్ లీవ్ చేసి స్పెక్స్ చేత పట్టుకొని.. దాని కొన కొరుకుతూ చాలా స్టైలిష్ గా కూర్చుంది. అలాగే డ్రెస్సుకు మ్యాచింగ్ రెడ్ కలర్ పెన్సిల్ హిల్స్ వేసుకొని అందాలను ఆరబోస్తోంది. పడుకొని కూర్చొని సోఫాపై నిల్ డౌన్ చేస్తూ రెచ్చిపోయింది. అసలే అందగత్తె.. ఆపై రెడ్ డ్రెస్సు... విపరీతమైన అందాల ఆరబోత... అబ్బో ఈ ఫొటోలో అమ్మడి అందం గురించి వర్ణించాలంటే కవులు దిగిరావాల్సిందే అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. నీ అందాన్ని తట్టుకోలేక పోతున్నామని హాట్ నెస్ ఓవర్ లోడెడ్ క్యూట్ బ్యూటీ అంటూ చెప్పుకొస్తున్నారు. థైస్ అందాలతో పాటు ఎద అందాలు అదిరాయి అంటూ మరికొంత మంది కామెంట్ల రూపంలో తమ మనసులోని భావాలను వెల్లడిస్తున్నారు. ఈ డ్రెస్సులో పూజ అందాలు అన్నీ కనిపిస్తుండగా... ఒక్కొక్కరు ఒక్కో విధంగా కామెంట్లు చేస్తున్నారు. మీరూ ఓ లుక్కేసేయండి ఈ పొడుగు కాళ్ల సుందరిపై.


## సౌత్ ఇండస్ట్రీపై తాప్సీ వివాదాస్పద వ్యాఖ్యలు

2010 సంవత్సరంలో మంచు మనోజ్ హీరోగా నటించిన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో హీరోయిన్ గా తాప్సీ పరిచయం అయింది. మొదటి సినిమానే రాఘవేంద్ర రావు వంటి దిగ్గజ దర్శకుడి దర్శకత్వంలో చేయడంతో తాప్సి కెరీర్ దూసుకు పోతుందని అప్పుడే అంతా భావించారు. అన్నట్లుగానే మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా టాలీవుడ్ లో మంచి ఆఫర్లు వచ్చాయి. స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశం దక్కింది. కానీ నటిగా ఆమెకు కమర్షియల్ బ్రేక్ మాత్రం దక్కలేదు. భారీ విజయాలు ఆమె ఖాతాలో పడలేదు. దాంతో హిందీలో ఛష్మే బద్దూర్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. సౌత్ లో నటిస్తూనే హిందీలో కూడా ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. 2016 నుండి హిందీ సినిమాల్లో బిజీ అయ్యింది. హిందీ సినిమా పరిశ్రమలో అడుగు పెట్టి



పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఒక చిట్ చాట్ లో తాప్సి మాట్లాడుతూ.. బాలీవుడ్ లో మంచి కథలను ఎంపిక చేసుకోవడం వల్ల మంచి ఫలితాలు వచ్చి ఇన్నాళ్ల పాటు కొనసాగాను అంటూ చెప్పుకొచ్చింది. సౌత్ సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ గా నటించిన సమయంలో స్టార్ డమ్ దక్కింది కానీ నటిగా ఎప్పుడు కూడా సంతృప్తి దక్కలేదు అంటూ తాప్సీ కామెంట్స్ చేసింది. తాప్సి కామెంట్స్ ప్రస్తుతం వివాదాస్పదం అవుతున్నాయి. సౌత్ లో ఎన్నో పెద్ద సినిమాల్లో నటించడంతో పాటు కొన్ని మంచి పాత్రల్లో నటించి మంచి పేరు దక్కించుకుంది. అయినా కూడా నటిగా సౌత్ లో నటించడం వల్ల సంతృప్తి దక్కలేదు అనడం సౌత్ సినీ ఇండస్ట్రీని అవమానించినట్లే అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. బాలీవుడ్ లో మంచి కథలు ఎంపిక చేసుకుని నటించడం వల్ల సంతృప్తి దక్కిందని.. సౌత్ లో స్టార్ డమ్ దక్కినా సంతృప్తి దక్కలేదని తాప్సి చేసిన వ్యాఖ్యలపై పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. సౌత్ లో కూడా మంచి కథలను ఎంపిక చేసుకుని నటించాల్సింది కదా అంటూ కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. సౌత్ ఇండస్ట్రీ లో చేసిన సినిమాల వల్లే బాలీవుడ్ లో ఆఫర్స్ వచ్చాయి అనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## టైటిల్ ఫిక్స్.. ఇలా ఊహించలేదు!







నాచురల్ స్టార్ నాని గత నెలలో దసరా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్ కి సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన దసరా సినిమాతో శ్రీకాంత్ ఓదెల దర్శకుడిగా పరిచయం అయ్యారు. కంప్లీట్ మాస్ అండ్ రా కల్ట్ సబ్జెక్టుతో న్యాచురల్ స్టార్ నాని ఈ సినిమా చేయడం విశేషం. తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన ఈ మూవీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మూవీలో నాని పోషించిన ధరణి పాత్ర అయితే బాగా కనెక్ట్ అయింది. నాని కెరియర్ లోనే హైయెస్ట్ కలెక్షన్స్ సొంతం చేసుకున్న సినిమాగా దసరా నిలిచింది. ఇదిలా ఉంటే దసరా రిలీజ్ కి ముందే నాని మరో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. అది కూడా కొత్త దర్శకుడుతోనే చేయడం విశేషం. శౌర్యువ్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతూ ఉన్నారు. నాచురల్ స్టార్ నాని 30వ సినిమాగా ఇది తెరకెక్కుతూ ఉండడం విశేషం. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాగూర్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది.

సీతారామం లాంటి బ్లాక్ బస్టర్ సినిమా తర్వాత మృణాల్ ఠాగూర్ తెలుగులో చేస్తున్న రెండో సినిమా ఇది కావడం విశేషం. తండ్రి కూతుళ్ళ అనుబంధం బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ కథ ఉండబోతుంది అని ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా విడాకులు తీసుకున్న భార్య భర్తల మధ్య నలిగిపోయే చిన్నారి పాత్ర దృక్కోణం నుంచి ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ఇదొక అద్భుతమైన కథ అని చెప్పారు. ఇదిలా ఉంటే హాయ్ నాన్న అనే టైటిల్ ఈ సినిమాకి నిర్ణయించినట్లుగా ప్రచారం నడుస్తోంది. తండ్రి కూతుర్ల అనుబంధం ప్రధాన ఇతివృత్తం కావడంతో ఈ ఇంట్రెస్టింగ్ టైటిల్ మూవీకి ఫైనల్ చేసినట్లుగా టాక్. గతంలో నాని జెర్సీ సినిమాలో తండ్రి కొడుకుల మధ్య ఎమోషనల్ బాండింగ్ నేపథ్యంలో కథాంశాన్ని ఆవిష్కరించి బ్లాక్ బాస్టర్ కొట్టారు. ఈ నేపథ్యంలో మరోసారి అలాంటి ఎమోషనల్ అటాచ్మెంట్ స్టోరీని తెరపై ఆవిష్కరిస్తూ ఉండడం ఆసక్తికరంగా మారింది.

## సూపర్ స్టార్ సూపర్ స్టైలిష్ ఫ్యామిలీ



బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ తాజాగా పఠాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. దశాబ్ద కాలం తర్వాత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న షారుఖ్ ఖాన్ మరియు ఆయన అభిమానులు ఫుల్ జోష్ తో ఉన్నాడు. అదే జోష్ తో అట్లీ దర్శకత్వంలో జవాన్ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే.

మరిన్ని సినిమాలకు కూడా షారుఖ్ ఖాన్ కమిట్ అవుతున్నాడు. ఒక వైపు సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా తన స్వీట్ ఫ్యామిలీ తో సాధ్యం అయినంత ఎక్కువ సమయం ను షారుఖ్ ఖాన్ గడుపుతూ ఉంటాడు. కింగ్ ఖాన్ పెద్దబ్బాయి ఆర్యన్ ఖాన్ సినిమా ఇండస్ట్రీ ఎంట్రీకి సిద్ధం అవుతున్నాడు. మరో వైపు కూతురు సుహాన ఖాన్ కూడా నటిగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక అబ్ రమ్ ఖాన్ చిన్న పిల్లాడనే విషయం తెల్సిందే. షారుఖ్ తాజాగా తన ఫ్యామిలీ ఫోటోతో సోషల్ మీడియాలో సందడి చేశాడు. భార్య మరియు ముగ్గురు పిల్లలతో షారుఖ్ ఖాన్ ఫోటోలకు ఇచ్చిన ఫోజ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులకు ఈ ఫోటో కన్నుల విందు అనడంలో సందేహం లేదు. షారుఖ్ ఖాన్ ఈ వయసు లో కూడా చాలా యంగ్ గా కనిపిస్తున్నాడని.. ముగ్గురు పిల్లల తండ్రిలా కాకుండా.. ఆ ముగ్గురి పిల్లల యొక్క అన్నగా కనిపిస్తున్నాడు అంటూ సోషల్ మీడియాలో అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

ఈ బాద్ షా ఫ్యామిలీ అంతా ఎప్పుడూ ఇలాగే సంతోషంగా ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## సాయం సంధ్యలో మయూరం పురి విప్పెను

నిహారిక కొణిదెల వ్యక్తిగత జీవితం.. బ్రేకప్ గురించి నిరంతరం మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ప్రచారాన్ని నిహారిక ఖండించను లేదు.. ఖరారు చేయనూ లేదు. కానీ ఇటీవల సోషల్ మీడియా ఫోటోషూట్లు చూస్తుంటే నిహారిక తిరిగి కథానాయికగా రీఎంట్రీ ఇవ్వడం ఖాయమని హింట్ ఇస్తున్నాయి. మునుపటితో పోలిస్తే నిహారిక ఫోటోషూట్లలో గ్లామర్ హంగు పెరిగిందంటూ అభిమానులు గుర్తిస్తున్నారు. తాజాగా సోషల్ మీడియాల్లో నిహారిక లేటెస్ట్ ఫోటో ఒకటి వైరల్ గా మారింది. ఇందులో ఊదారంగు చీరలో నిహారిక పోర్ట్రెయిట్ సంథింగ్ స్పెషల్ గా ఉందంటూ ఫ్యాన్స్ కితాబిచ్చేస్తున్నారు. గిరజాల జుట్టు ముక్కుకు ముక్కెర ఆభరణాలతో మెగా ప్రిన్సెస్ ఎంతో




ఒద్దికగా కనిపిస్తోంది. సాయం సంధ్యా సమయం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ అందమైన ఫోటోఫ్రేమ్ అద్భుతంగా కెమెరాలో బంధీ అయింది. ఇది అభిమానుల హృదయాల్ని టచ్ చేసింది. సాయం సంధ్యలో మయూరం పురి విప్పినంత అందంగా మెగా ప్రిన్సెస్ కనిపిస్తోందంటూ ఫ్యాన్స్ మైమరిచిపోతున్నారు. వివాహానికి ముందు టాలీవుడ్ లో కథానాయికగా .. నిర్మాతగా రాణించేందుకు నిహారిక చేసిన ప్రయత్నాల గురించి తెలిసిందే. బుల్లితెర హోస్ట్ గాను నిహారిక అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు మరోసారి మునుపటిలా యాక్టివ్ అవ్వబోతోందంటూ ఫ్యాన్స్ ఊహిస్తున్నారు. పెళ్లి తర్వాత నటనకు దూరంగా ఉన్న నీహారిక తిరిగి కథానాయికగా రీఎంట్రీ ఇచ్చేది ఎప్పుడు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## సుస్మితా సేన్ బ్యాక్ టూ యాక్షన్!

సీనియర్ నటి సుస్మితా సేన్ ఇటీవల అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. హృదయ సంబంధిత సమస్యలు ఎదుర్కోవడంతో కెమెరాకి దూరంగా ఉండాల్సి వచ్చింది. తాజాగా సుస్మిత అనారోగ్యం నుంచి కోలుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మళ్లీ కెమెరా ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. దీనిలో వెబ్ సిరీస్ 'ఆర్య-3' షూటింగ్ షురూ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సిరీస్ షూటింగ్ జైపూర్ లో జరుగుతోంది. దీనిలో భాగంగా ఆదివారం ఆమె షూట్ కి హాజరయ్యారు. నేటి నుంచి యధావిధిగా షూటింగ్ లో పాల్గొంటున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసారు. 'ప్రస్తుతం నేను పూర్తిగా కోలుకున్నాను. సరిపోయినంత విశ్రాంతి తీసుకున్నాను. ఎక్కడైతో అస్వస్తతకి గురయ్యానో? అక్కడికి సంపూర్ణ ఆరోగ్యం వస్తున్నా. 'ఆర్య-3' మూడవ భాగం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఇక ఎంత మాత్రం సమయం వృద్ధా చేయను'



అని తెలిపారు. ఇంతకు ముందు సుస్మితసేన్ ప్రధాన పాత్రలో 'ఆర్య'..'ఆర్య2' వెబ్ సిరీస్ లు తెరకెక్కిన సంగతి తెలిసిందే. వాటికి కొనసాగింపుగా వస్తోన్న మూడవ భాగమిది. రామ్ మద్వానీ..సందీప్ మోదీలు సంయుక్తంగా తెరకెక్కిస్తోన్న వెబ్ సిరీస్ ఇది. రెండు భాగాలకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో మూడవ భాగం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఆ భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అయితే రిలీజ్ తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. చిత్రీకరణ అనంతరం తేదీ ప్రకటించే అవకాశం ఉంది. అలాగే ఆ మధ్య సుస్మితా సేన్ వ్యాపార వేత్త లలిత్ మోదీతో ప్రేమలో ఉన్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. పెళ్లి కూడా చేసుకుంటు న్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఆ ప్రేమాయణం ఎంత వరకూ వచ్చిందన్నది ఎలాంటి అప్ డేట్ లేదు. ఈనేపథ్యంలో విడిపోయారని ప్రచారం సాగింది. అయితే ఈ ప్రచారం పై వాళ్లిద్దరు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. సుస్మితా సేన్ మాత్రం వృత్తిగత జీవితంపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది.



# రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు రారాజు హైదరాబాద్..

## ఢిల్లీ, ముంబై కూడా ఆ తర్వాతే

హైదరాబాద్ : రియల్ ఎస్టేట్ రంగంలో విస్తృతమైన పెట్టుబడులు వస్తున్న దరిమిలా హైదరాబాద్ రారాజులా నిలుస్తున్నది. మన మహానగరం.. పారిశ్రామిక పెట్టుబడులతోపాటు రియల్ పెట్టుబడులకు సైతం స్వర్గధామంగా మారింది. రియల్ బూమ్‌లో దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే ముందంజలో ఉన్నట్లు 'ఇండియన్ రియల్ ఎస్టేట్-బెట్టింగ్ ఆన్ ఏ క్యాపిటల్ ఫ్యూచర్' సర్వే వెల్లడించింది. ఒక్కో రంగంలో తనదైన ముద్ర వేసుకుంటూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహా నగరం.. పారిశ్రామిక పెట్టుబడులతోపాటు రియల్ పెట్టుబడులకు సైతం స్వర్గధామంగా మారింది. అంతర్జాతీయ కంపెనీలు నగరానికి క్యూ కడుతుండటంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయి. దీనికి తోడు ఆఫీస్ స్పేస్‌కు కూడా భారీ ఎత్తున డిమాండు ఏర్పడటంతో రియల్ బూమ్‌లో దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే హైదరాబాద్ ముందంజలోకి దూసుకెళ్లింది. ఇది ఏదో అల్లాటప్పాగా చెప్తున్న మాట కాదు. ప్రముఖ రేటింగ్ సంస్థ సీబీఆర్‌ఈ సౌత్ ఏషియా ప్రైవేటు లిమిటెడ్ 'ఇండియన్ రియల్ ఎస్టేట్-బెట్టింగ్ ఆన్ ఏ క్యాపిటల్ ఫ్యూచర్' పేరిట చేపట్టిన సర్వేలో నిగ్గుతేల్చిన సత్యమిది. నివాససౌకర్యాలు, వాణిజ్య కట్టడాల విషయంలో అయినా రియల్ ఎస్టేట్ రంగానికి హైదరాబాద్ అత్యంత అనుకూల ప్రదేశంగా మారిందని ఈ సర్వేలో తేలింది.

**రూ.18 వేల కోట్ల పెట్టుబడులు :** జాతీయ,అంతర్జాతీయ పెట్టుబడిదారులకు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఆశాజనకంగా తయారైంది. రియల్ ఎస్టేట్ రంగంలో గత ఐదేండ్లలో భారీగా పెట్టుబడులు వచ్చిన మెట్రో నగరాల్లో హైదరాబాద్ మొదటి ఐదు నగరాల్లో స్థానం సంపాదించింది. 2018- 2022 మధ్య కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం 2.24 బిలియన్ యూఎస్ డాలర్లు (సుమారు రూ.18 వేల కోట్లు) ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించింది. ఇది దేశంలోని రియల్ పెట్టుబడుల్లో 7 శాతం. నగరంలో కేవలం 24 భూ ఒప్పందాల ద్వారానే 970 ఎకరాల భూమిని పలు కంపెనీలు స్వాధీనం చేసుకోగా, వీటి విలువ సుమారు రూ.8,136 కోట్లు ఉంటుందని సీబీఆర్‌ఈ నివేదికలో పేర్కొన్నారు. 2018 నుంచి సేకరించిన మొత్తం భూమిలో 14 శాతంకంటే ఎకువ వాటాతో దేశంలో రెండో స్థానంలో హైదరాబాద్ నిలిచింది. 2018- 2022 మధ్య కాలంలో దేశంలో సుమారు రూ.3.56 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అందులో అంతర్జాతీయ పెట్టుబడుల వాటా (క్రాస్ రీజినల్ ఇన్వెస్టర్లు) దాదాపు 47 శాతం. దేశీయ పెట్టుబడిదారుల (రియల్ ఎస్టేట్ డెవలపర్స్) వాటా 42 శాతంగా నమోదైంది. ముఖ్యంగా అంతర్జాతీయ పెట్టుబడుల్లో అధికంగా ఉత్తర అమెరికా నుంచి వచ్చినట్లు నివేదికలో తెలిపారు. రాబోయే రెండేండ్లలో మరో 16 నుంచి 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చే అవకాశం ఉన్నదని సీబీఆర్‌ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమాన్ మ్యాగజైన్ తెలిపారు.

**ఆఫీస్ స్పేస్‌లో రారాజు :** రియల్ ఎస్టేట్ రంగంలో విస్తృతమైన పెట్టుబడులు వస్తున్న దరిమిలా హైదరాబాద్ ఆఫీస్ స్పేస్‌లో రారాజులా నిలుస్తున్నది. 2021-22 అనరాక్ నివేదిక ప్రకారం దేశంలోని ఏడు మెట్రో నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. 2021-22లో 3.42 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ విక్రయం, లీజుతో ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె, బెంగళూరు, ఢిల్లీ నగరాలను వెనక్కు నెట్టింది. అంతర్జాతీయస్థాయి కంపెనీలు ఇక్కడ రెండో క్యాంపస్‌లను ఏర్పాటు చేయడంతోపాటు భవిష్యత్తు అవసరాల కోసం ముందుగానే భూములను కొనుగోలు చేస్తుండటం ఎక్కువగా కనిపిస్తున్నది. అందుకే తాజా నివేదికలో భూ సేకరణలో దేశంలోనే హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది.



# కోటి దాటేసిన హైదరాబాద్ జనాభా.. ఈ విషయాన్ని చెప్పిందెవరో తెలుసా?

హైదరాబాద్ : ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ను గుర్తిస్తూ దీనికి సంబంధించిన వివరాల్ని ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం అంచనా వేయటం తెలిసిందే. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలు ఆయా నగరాల్లోని జనాభా పెరుగుదల గురించిన అంచనాను వెల్లడించింది. ఈ సందర్భంగా ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. దేశంలో అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. మొన్నటివరకు నగర జనాభా కోటి కంటే తక్కువ అన్న విషయాన్ని సరి చేసి ప్రస్తుతం హైదరాబాద్ మహానగర జనాభా కోటికి పైనే అంటూ కొత్త అంచనాను వెల్లడించింది. జనాభా పరంగా చూస్తే భారత్ లో ఆరో అతి పెద్ద నగరంగా హైదరాబాద్ నిలిస్తే. ప్రపంచంలో 34వ స్థానంలో నిలవటం గమనార్హం హైదరాబాద్ మహానగర జనాభా 1.05 కోట్లను దాటేసిందన్న విషయాన్ని వెల్లడించింది. 2035 నాటికి హైదరాబాద్ మహానగర జనాభా 1.41 కోట్లకు చేరుకుంటుందన్న అంచనాను వేసింది. 1950లో 10 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా 1975 నాటికి 20 లక్షలకు చేరగా. ఆ తర్వాత కేవలం 15 ఏళ్ల కాలంలో 40 లక్షలకు (1990 నాటికి) చేరుకుంది. తర్వాత ఇరవై ఏళ్లకు అంటే 2010లో 80లక్షలకు చేరినట్లుగా పేర్కొంది. గతంలో అంటే జీహెచ్‌ఎంసీకి పూర్వంగా ఉన్న ఎంసీహెచ్ పరిధి 170 చదరపు కిలోమీటర్ల పరిధి మాత్రమే ఉండగా. జీహెచ్ఎంసీ ఏర్పాటుతో దీని విస్తీర్ణం 650 చదరపు కిలోమీటర్ల పరిధికి నగరం విస్తరించింది. అదే అవుటర్ రింగురోడ్డును పరిగణలోకి తీసుకుంటే వెయ్యి చదరపు కి.మీ విస్తీర్ణం ఉంటుంది. ఏడాది వ్యవధిలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ కు వచ్చేస్తున్న వారి సంఖ్య 4.07 లక్షలుగా ఉంటే. వివిధ రాష్ట్రాల నుంచి వలసలుగా వచ్చే వారి సంఖ్య 88216గా అంచనా వేశారు. కోటి అంకెను దాటేసిన హైదరాబాద్ జనాభాలో పద్నాలుగేళ్ల లోపు పిల్లల దాదాపుగా 25 శాతం వరకు ఉంటారని పేర్కొంది. నగర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న జనాభా 15-64 ఏళ్ల మధ్యలో ఉన్న వారేనని పేర్కొంది.

# సాయన్న సీటు కోసం.. కుమార్తెల ఫైటింగ్..

## కంటోన్మెంట్ రాజకీయం గరంగరం!



హైదరాబాద్ : ఈ ఏడాది నవంబరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున సీట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలావుంటే రాజధాని భాగ్యనగరంలోని ఏక్కైక ఎస్సీ అసెంబ్లీ సెగ్మెంట్ సికింద్రాబాద్లోని కంటోన్మెంట్. ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున జి. సాయన్న విజయం దక్కించుకున్నారు. గతంలోనూ ఆయన ఇక్కడ గెలిచారు. పార్టీ ఏదైనా ఆయన గెలుపు మాత్రం పక్కా అనే రేంజ్లో ఇక్కడ రాజకీయాలు సాగాయి. అయితే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 72 ఏళ్ల సాయన్న అనారోగ్యం కారణంగా మరణించారు. దీంతో వాస్తవానికి ఇక్కడ ఉప ఎన్నిక రావాల్సి ఉంది. కానీ ఎలానూ జనరల్ ఎన్నికలకు సమయం దగ్గర పడడంతో ఇక్కడ ఒకే సారి నవంబరులో అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అయితే.. సాయన్న మరణంతో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పెద్ద దిక్కును కోల్పోయింది. సాయన్న లేని లోటును భర్తీ చేయడం బీఆర్ఎస్కి సవాలుగా మారింది. ఇక సాయన్నకు వారసులు లేరు. ఉన్నది ముగ్గురు ఆడపిల్లలే. నమ్రత లాస్యనందిత నివేదిత. వీరు తమ తండ్రి సీటు కోసం అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎవరికి వారు తమ తమ పరపతిని వినియోగించి.. కేసీఆర్ను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట. ముఖ్యంగా మధ్యలో అమ్మాయి లాస్యనందిత తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలుస్తోంది. గతంలో కవాడిగూడ డివిజన్ నుంచి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే మరుసటి ఎన్నికల్లో ఆమె ఓటమి చవి చూశారు. సాయన్న వారసురాలిగా లాస్యనందితను ప్రకటిస్తే కంటోన్మెంట్ ప్రజల నుంచి మద్దతు లభిస్తుందని వచ్చే ఎన్నికల్లో విజయం సులభం అవుతుందని ఆమె అను కూల వర్గం అభిప్రాయపడుతోంది. ఇక లాస్య కూడా.. నియోజకవర్గంలోనే ఉంటున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా కలుస్తున్నారు. మరోవైపు.. నివేదిత నమ్రత కూడా బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నారని సాయన్న అనుచరులు చెబుతున్నారు. దీంతో ఈ కుటుంబంలో కంటోన్మెంట్ పాలిటిక్స్ పీక్ స్టేజ్కు చేరాయని అంటున్నారు పరిశీలకులు. మరి కేసీఆర్ ఎవరిని కరుణిస్తారో చూడాలి.

**సాయన్న హిస్టరీ ఇదీ..** దివంగత ఎమ్మెల్యే సాయన్న తొలిసారిగా 1994లో కంటోన్మెంట్ టీడీపీ నుంచి విజయం సాధించారు. 1999 2004లోనూ విజయాలు అందుకున్నారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి పి.శంకరరావు చేతిలో ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందారు. 2016లో టీఆర్ఎస్లో చేరారు. 2018 ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి విజయం సాధించారు.




భారత రాష్ట్ర సమితిను మూడోసారి అధికారంలోకి రాకుండా ఉండేందుకు.. కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కాకుండా నిలువరించే పార్టీలోనే చేరుతానని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోపు తన రాజకీయ పయనంపై స్పష్టత వస్తుందని వెల్లడించారు. ఈ నెలాఖరులో ఖమ్మంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంతో భారాసపై యుద్ధం ప్రకటిస్తానన్నారు.

# పండగ వాతావరణంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు : మంత్రి తలసాని



బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో హోం మంత్రి మహమూద్ అలీ, జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్‌తో కలిసి హైదరాబాద్ జిల్లా ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఉత్సాహంగా సాగుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో అనేక నియోజకవర్గాల్లో డివిజన్ స్థాయి సమ్మేళనాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. మిగతా డివిజన్లలో 24లోగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 25న నిర్వహించే నియోజకవర్గ సమ్మేళనాలకు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఎన్నికల్లో పోటీ చేసిన వారిని, పార్టీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నేతలను ఆహ్వానించాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో పార్టీ పతాకాలను ఆవిష్కరించి సమావేశం వద్దకు రావాలని చెప్పారు. సమ్మేళనాల సందర్భంగా జెండాలు, తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. సమావేశం నిర్వహణకు సంబంధించి సమగ్రమైన ఎజెండాను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేసేలా ప్రగతి నివేదికను రూపొందించి ఆత్మీయ సమ్మేళనంలో వివరించాలన్నారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్ రావు, సురభి వాణిదేవి, స్టీఫెన్ సన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేశ్, రావుల శ్రీధర్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఆనంద్ గౌడ్, నందు బిలాల్, ఆజాం, సలావుద్దీన్ లోది, రాంరెడ్డి, జీవన్ సింగ్, బక్రీ పాల్గొన్నారు.

# వందే భారత్ సరే.. మరి ఈ వందే భారత్ మెట్రో ఏంటి?



హైదరాబాద్ : దేశంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే రైలుగా చెప్పే వందే భారత్ రైలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు దేశంలో అందుబాటులో ఉన్న రైల్ (రెగ్యులర్) జర్నీకి పూర్తి భిన్నమైన అనుభూతిని కలిగించటంలో వందే భారత్ రైళ్లు సక్సెస్ అయ్యాయి. రెండు పెద్ద నగరాల మధ్య పరుగులు తీసే ఈ రైళ్లను రోజులో రెండు ట్రిప్పులు వేయటం తెలిసిందే. తెల్లవారు జామున మొదలయ్యే దీని జర్నీ.. అర్ధరాత్రి దాటే లోపు తన చివరి గమ్యస్థానానికి చేరుకుంటుంది. మోడీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా పట్టాల మీదకు తెరకెక్కించిన ఘనత మోడీ సర్కారుకే దక్కుతుంది. ఇదిలా ఉంటే.. వందే భారత్ వరకు ఓకే అయినా.. తాజాగా వందే భారత్ మెట్రో పేరుతో మరో తరహా రైలును తెర మీదకు తీసుకొస్తున్నారు. ఈ రైలు ప్రత్యేకత ఏమిటి?వందే భారత్ కు.. వందే భారత్ మెట్రోకు మధ్యనున్న తేడా ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. అయితే.. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాల్ని ఇట్టే చెప్పేయొచ్చు. అదేమంటే..వందే భారత్ రైళ్లను దూర ప్రాంతాల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించేందుకు ఉద్దేశించినవి కాగా.. వందే భారత్ మెట్రో వెర్షన్ దానికి కాస్తంత భిన్నమైనది. ఒకే ప్రాంతానికి చెందిన రెండు పట్టణాల మధ్య పరుగులు తీసేలా వీటిని డిజైన్ చేశారు. ఈ వందే భారత్ మెట్రోలతో విద్యార్థులు.. ఉద్యోగులకు మరింత సౌకర్యంగా ఉంటాయని చెప్పాలి. వందే భారత్ రైళ్లను 500-600 కిమీ దూరం ఉన్న నగరాల మధ్య ప్రధాన పట్టణాల్ని కలుపుతూ నడిపిస్తున్నారు. ఇందులో స్లీపర్ క్లాస్ ఉండదన్న విషయం తెలిసిందే. త్వరలో వీటిని అందుబాటులోకి తేనున్నారు. అయితే.. వందే భారత్ మెట్రో రైళ్లను చూస్తే 100కి.మీ. లోపు ఉన్న ప్రాంతాల మధ్య రాకపోకలు సాగిస్తారు. వందే భారత్ రైలు రోజు మొత్తంలో రెండు ట్రిప్పులు (అప్ అండ్ డౌన్) వేస్తాయి. అయితే.. వందే భారత్ మెట్రో మాత్రం (రెండుసార్లు అప్ .. రెండుసార్లు డౌన్ ట్రిప్పులు) నాలుగు ట్రిప్పులు వేస్తాయి. వందే భారత్ లో పదహారు కోచ్ లు ఉంటాయి. వందే భారత్ మెట్రోలో మాత్రం ఎనిమిది కోచ్ లు మాత్రమే ఉంటాయి. వందే భారత్ లో గరిష్ఠంగా 160కి.మీ. వేగంతో ప్రయాణించేలా వీటిని డిజైన్ చేశారు. కానీ.. వాస్తవంలో అంత వేగంతో నడపటం లేదు.


పట్టాల సామర్థ్యం సరిపోక 130కి.మీ. వేగంగా ప్రయాణిస్తున్నట్లు చెబుతున్నా.. వంద దాటట్లేదు. ఇక.. వందే భారత్ మెట్రో రైళ్ల విషయానికి వస్తే వీటిని గంటకు 130 కిమీ వేగంతో పరుగులు తీసేలా రూపొందిస్తున్నారు. కానీ.. ఇది గంటకు వంద కిలోమీటర్ల కంటే తక్కువ వేగంతోనే నడిచే అవకాశం ఉందంటున్నారు. వందే భారత్ ట్రైన్ లలో బాత్రూం సౌకర్యం ఉంటే.. వందే భారత్ మెట్రోలో బాత్రూంలు ఉండవు. టికెట్ల ధరలు వందే భారత్ తో పోలిస్తే.. వందే భారత్ మెట్రో ధరలు తక్కువగా ఉండే వీలుఉంటుందని చెబుతున్నారు. త్వరలోనే వందే భారత్ మెట్రో రైల్ ను పట్టాలు ఎక్కించే కార్యక్రమానికి వేగంగా అడుగులు పడుతున్నాయి.

# మంత్రి ఎర్రబెల్లికి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు

జనగామ : ఢిల్లీలో జరిగిన పంచాయతీ రాజ్ జాతీయ అవార్డులు పొంది వచ్చిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును జిల్లా అధికారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాధించిన 13 అవార్డులను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా, మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో ఆయా గ్రామాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇటీవల అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన మంత్రిని జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి శాలువాతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల గ్రామం సమృద్ధిగా మంచినీరు ఉన్న విభాగంలో దేశంలో నెంబర్ వన్ గా నిలవడం పట్ల కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌ను మంత్రి అభినందించి సత్కరించారు.

# దివిటిపల్లి ఐటీ టవర్‌కు మే 6న శ్రీకారం.. ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఐటీ టవర్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే టీఆర్ మే 6న ప్రారంభిస్తారని క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో టీఎస్‌ఐఐసీ అధికారులతో ఐటీ టవర్ ప్రారంభోత్సవం, మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్-బెంగళూరు హైవే-44 నుంచి దివిటిపల్లి శివారులోని ఐటీ టవర్ వరకు 100 ఫీట్ల రోడ్డును నిర్మించాలని ఆదేశించారు. కనెక్టింగ్ రోడ్డు ప్రారంభమయ్యే చోట ఆకర్షణీయంగా ముఖద్వారం నిర్మించాలని సూచించారు. టవర్ నుంచి మహబూబ్‌నగర్‌కు కనెక్టింగ్ రహదారులుండాలని కలెక్టర్ రవిని ఆదేశించారు. ఐటీ టవర్ ఏర్పాటుతో నాలుగేండ్ల లో 40 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్



రవి, డీజేఎం శ్యాంసుందర్‌రెడ్డి, కన్సల్టెంట్ రాజ్‌కుమార్, నిర్మాణ సంస్థ గుత్తేదారులు రాజశేఖర్‌రెడ్డి, అమరరాజా ప్రతినిధి రవితేజ పాల్గొన్నారు.

# నకిరేకల్ వద్ద కల్వర్టును ఢీకొట్టిన కారు.. తండ్రీ కొడుకులు మృతి



హైదరాబాద్: నల్లగొండ జిల్లా నకిరేకల్ శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ వస్తున్న కారు.. నకిరేకల్ శివారులో జాతీయ రహదారిపై అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకులు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాదీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ ఘనటపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com